

ప్యాకేజీ-1పై విజి'లెన్స్'

- విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం
- రికార్డులన్నీ ఇవ్వాలంటూ విజిలెన్స్ అధికారుల లేఖ
- కదిలించిన 'ఆంధ్రజ్యోతి' కథనాలు
- అవినీతి అధికారుల్లో మొదలైన వణుకు



పెన్నా డెల్టా ప్యాకేజీ-1 ఆధునికీకరణ పనులపై వస్తున్న ఆరోపణలపై ఇరిగేషన్ అధికారులు స్పందించకపోయినా ప్రభుత్వం మాత్రం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులపై విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. పూర్తి విచారణ జరిపి నివేదిక అందజేయాలని విజిలెన్స్ విభాగాన్ని ప్రభుత్వం ఆదేశించడంతో సంబంధిత అధికారులు రంగంలోకి దిగారు. ప్యాకేజీ-1 పూర్తి వివరాలు అందజేయాలని విజిలెన్స్ ఎస్పీ కే శ్రీనివాసరావు ఈ నెల 10వ తేదీన ఇరిగేషన్ ఎస్ఈ దేశానాయక్‌కు లేఖ రాశారు. 17వ తేదీలోపు రికార్డులన్నీ అందజేయాలని ఆ లేఖలో సూచించారు. ఆ తర్వాతే విజిలెన్స్ అధికారులు విచారణ మొదలుకానుంది. ఈ వ్యవహారం ఇరిగేషన్ శాఖలో కలకలం రేపుతుండగా, సంబంధిత అధికారుల్లో మాత్రం వణుకు మొదలైంది. అటు క్వాలిటీ కంట్రోల్ డివిజన్ కార్యాలయంలో ప్రీక్లోజర్‌కు సంబంధించిన రికార్డులు కనిపించడం లేదు. ఇటు సెంట్రల్ డివిజన్‌లో కూడా కొన్ని డాక్యుమెంట్లు మాయమైనట్లు ఆరోపణలున్నాయి. మరి విజిలెన్స్ అధికారులకు అన్నీ రికార్డులు అందుతాయో.. లేదో.. చూడాలి.

- వివరాలు 8లో..

ఎఫ్‌బీవోపై సస్పెన్షన్ వేటు

ఉదయగిరి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాలపల్లి ఫారెస్టు బీట్ అధికారి (ఎఫ్‌బీవో) భానుతేజను సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయినట్లు రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా ఒక ప్రకటనలో తెలిపారు. శకునాలపల్లి వీఎస్ఎస్‌లో ఉన్న జామాయిల్ కర్రను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నారంటూ ఎఫ్‌బీవోపై ఇటీవల వీఎస్ఎస్ వైస్ చైర్మన్, సభ్యులు రేంజ్ అధికారికి ఫిర్యాదు చేశారు. విచారించి నివేదికను జిల్లా అటవీ శాఖాధికారికి పంపడంతో ఆయన భానుతేజను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

మరో కరోనా కేసు నమోదు

- 12కు చేరిన కేసుల సంఖ్య
- జిల్లాకు చేరుకున్న 400 ర్యాపిడ్ కిట్లు

నెల్లూరు (వైద్యం) (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మరో కరోనా కేసు నమోదయ్యింది. నెల్లూరుకు చెందిన 30 ఏళ్ల యువకుడు కొవిడ్ బారిన పడినట్లు శుక్రవారం పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. దీంతో జిల్లాలో కరోనా కేసుల సంఖ్య 12కు చేరింది. మరోవైపు కరోనాను నిర్ధారించే ర్యాపిడ్ కిట్లు 400 వరకు శుక్రవారం జిల్లాకు చేరుకోగా, వీటిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రా లకు తరలించనున్నారు. వీటి ద్వారా అనుమానిత ప్రాంతాలలో నిర్ధారణ పరీక్షలు చేస్తారు. పాజిటివ్ వస్తే ఆర్టీపీసీఆర్ కచ్చితత్వ పరీక్ష ద్వారా వ్యాధి ని గుర్తించి చికిత్స అందచేస్తారు. ఈ ఆర్టీపీసీఆర్ కిట్లు కూడా 250 వరకు జిల్లాకు రాగా వీటిని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలకు అందించారు.

కాకాణి బెయిల్ తదుపరి విచారణ 16న

నెల్లూరు (లీగల్), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి విచారణ 16వ తేదీకి వాయిదా పడింది. ఎస్టీ, ఎస్సీ, అక్రమ మైనింగ్, పేలుడు పదార్థాల నిషేధ చట్టం కేసులో కాకాణి రిమాండ్‌లో ఉన్నారు. బెయిల్ పిటిషన్ విచారణను 16వ తేదీకి వాయిదా వేస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ జడ్జి సరస్వతి శుక్రవారం ఉత్తర్వు చేశారు

సచివాలయాల ఉద్యోగులకు బదిలీలు

నెల్లూరు (జడ్పీ), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటికే ఇతర శాఖల బదిలీలు పూర్తవగా, సచివాలయాల ఉద్యోగుల బదిలీలు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే, ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో 30వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకునే వెసులుబాటు కల్పించారు. జిల్లావ్యాప్తంగా 900 మంది ఉద్యోగులు ఉండగా ఐదేళ్లు ఒకే ప్రాంతంలో విధులు నిర్వహించిన వారందరినీ తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంటుంది. అలాగే రిక్వెస్ట్ బదిలీలకూ అవకాశం కల్పించడంతో అలాంటి వారూ దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే సొంత మండలాలు మినహా మిగత ప్రాంతాలకు బదిలీ చేసుకునే అవకాశం ఉద్యోగులకు ఉంటుంది.

ఇక పంచాయతీలకు గ్రేడ్‌లు!


- స్పెషల్ గ్రేడ్‌లో 15, గ్రేడ్-1లో 73
- ప్రభుత్వానికి జాబితా పంపిన అధికారులు

నెల్లూరు (జడ్పీ), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పాలన మరింత సులువు చేసేందుకు, సుపరిపాలన అందించేందుకు పంచాయతీ వ్యవస్థలో మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. క్లస్టరు వ్యవస్థలో పాలనకు ఆటంకాలు ఏర్పడుతుండటం, ఒకే క్లస్టరు కింద ఆరేడు పంచాయతీలు ఉండటంతో పాలనకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర కసరత్తు చేసి పంచాయతీలకు గ్రేడ్‌లుగా విభజించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉన్నతాధికారులు పంచాయతీలను గ్రేడ్-1, 2, 3లుగా విభజించి, క్లస్టరు

(మిగతా 7వ పేజీలో)



తల్లికి వందనం.. బిడ్డలకు వరం!



అందరిదీ రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం. పస్తుల్లేకపోయినా ఉన్నంతలో బిడ్డలతో సంతోషంగా ఉంటున్నారు. కలిగిన బిడ్డలను తమ స్తోమతకు తగ్గట్టు స్కూళ్లలో చదివిస్తున్నారు. ఇప్పుడు విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో ఏదో ఒక ఖర్చు వెంటాడుతోంది. ఈ పరిస్థితుల్లో 'తల్లికి వందనం' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయడంతో పేదింట ఆనందం వెల్లివిరిసింది. వైసీపీ హయాంలో ఒకరికి మాత్రమే నగదు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ.13వేలు చొప్పున అందజేసింది.

చదువు ఖర్చులకు భయం లేదు!

నాపేరు అచ్చి చెంచురాధ. కలువాయి మండలం తెలుగురాయపురం ఎస్సీ కాలనీ. నాకు ముగ్గురు ఆడపిల్లలు. అచ్చి శాలిని 6వ తరగతి, లక్ష్మి 4వ తరగతి, ప్రణతి 2వ తరగతి చదువుతున్నారు. నా ముగ్గురు పిల్లలకు రూ.13వేలు వంతున రూ.39వేలు నా అకౌంట్లో పడ్డాయి. చాలా సంతోషంగా ఉంది. పిల్లల చదువుకు అవసరమైన ఖర్చులకు ఇబ్బంది లేదు. ప్రతి రోజూ వారిని బడి పంపిస్తాను.



తన నలుగురు పిల్లలతో తండ్రి పఠాన్ సలీమ్

ఏఎస్ పేటకు చెందిన నిరుపేద దంపతులు పఠాన్ సలీమ్, సాజిదాలకు నలుగురు పిల్లలు. పెద్ద కుమార్తె సుమేరా 8వ తరగతి, కుమారులు అజ్గర్ 6వ తరగతి, కవలలు నీహల్, సోహెల్ 1వ తరగతి చదువుతున్నారు. వీరందరికి రూ.52వేలు తల్లి పఠాన్ సాజిదా బ్యాంకు ఖాతాలో జమ అయ్యింది. ఆ మేరకు మొబైల్‌కు మెసేజ్ రావడంతో వారు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. తమ పిల్లల భవిష్యత్తు కోసం తల్లికి వందనం పేరుతో డబ్బు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

కష్టజీవికి పెద్ద ఊరట



రాపూరు మండలం బండేపల్లి హరిజనవాడకు చెందిన మారెమ్మ భర్త పుల్లయ్య నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఉపాధి హామీ పథకం పనులు చేస్తూ తన ముగ్గురు బిడ్డల్ని చదివిస్తోంది. పెద్ద కుమార్తె కీర్తి 7వ తరగతి, చిన్న కుమార్తె నాగలక్ష్మి 5వ తరగతి, కొడుకు శివశంకర్ 2వ తరగతి చదువుతున్నారు. రెక్కల కష్టంమీదే ఆధారపడ్డ మారెమ్మకు 'తల్లికి వందనం' పెద్ద ఊరటనిచ్చింది. ముగ్గురు బిడ్డలకు రూ.39వేలు తన ఖాతాల్లో జమ కావడంతో మారెమ్మ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వైసీపీ హయాంలో ఒక బిడ్డకు మాత్రమే నగదు ఇచ్చారని, ఇప్పుడు చంద్రబాబు పుణ్యమా అని ముగ్గురికి డబ్బు అందడంతో పిల్లల చదువుకు ఇబ్బందులు ఉండవంటూ మారెమ్మ ఆనందంతో చెప్పుకొచ్చింది.

పేదింట విరబూసిన ఆనందం • ఒక్కో విద్యార్థికి రూ.13వేలు చొప్పున 2,48,176 మంది మందికి నగదు • 1,62,975 మంది తల్లుల ఖాతాల్లో జమ



మనుబోలు మండలం యాచవరం గ్రామానికి చెందిన చల్లా కల్యాణ్, గౌరి దంపతులకు ముగ్గురు పిల్లలు. వేణు, పూర్విక వీరిద్దరు 5వ తరగతి, గీతిక 3వ తరగతి చదువుతున్నారు. తల్లికి వందనం పథకం ద్వారా గౌరి బ్యాంకు ఖాతాలో రూ.39వేలు జమ అయ్యాయి. అలాగే మండల కేంద్రమైన మనుబోలులో అందెల శివకుమార్‌రెడ్డి, కల్పన దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. ఒకరు పది, ఇద్దరు 2వ తరగతి చదువుతున్నారు. ఈ ముగ్గురికి కూడా 39 వేలు తల్లి కల్పన బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయి. ఇంత డబ్బు ఒకేసారి బ్యాంకులో జమ కావడంతో ఈ రెండు కుటుంబాల్లో ఆనందానికి అవధులు లేవు.

నెల్లూరు (విద్య), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పేదరికం కారణంగా ఏ పిల్లవాడూ విద్యకు దూరం కాకూడదన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద శుక్రవారం విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ కావడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లుబికింది. రాష్ట్రంలో ఈ పథకం కింద అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థికి (ప్రభుత్వ, ప్రైవేట్) ఏటా రూ.15వేలు ఆర్థిక సాయం చేసి వారి చదువులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. అయితే విద్యార్థికి రూ.13వేలు, విద్యాసంస్థ అభివృద్ధికి రూ.2వేలుగా నిర్ణయించి నిధులు విడుదల చేస్తున్నారు. జిల్లాలో విద్యాశాఖ యూడైస్ లెక్కల ప్రకారం 2,48,176 మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి అర్హులుగా గుర్తించారు. ఈ మేరకు 1,62,975 మంది తల్లుల ఖాతాల్లో ఒక్కో విద్యార్థికి రూ.13వేలు చొప్పున శుక్రవారం నుంచి నగదు జమ చేస్తున్నారు. 2023-24 విద్యాసంవత్సరాల్లో నమోదైన విద్యాశాఖ యూడైస్ ఆధారంగా విద్యార్థులు, తల్లుల జాబితాల ప్రకారం అర్హులకు నగదు పంపిణీ చేశారు. కాగా పెండింగ్ దరఖాస్తుదారులకు అధికారులు గడువు ఇచ్చారు. అన్ని పత్రాలను సమర్పించి బ్యాంకు ఖాతాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కాగా, ఒకటోతరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పూర్తయిన తరువాత ఆర్థిక సహాయం చేస్తారు.

ఆర్టీఈ ప్రవేశాలకు నేరుగా బడికే..

అర్హత ధ్రువీకరణ పూర్తయిన తర్వాత సచివాలయాల విభాగం, సంక్షేమ, ఆర్థిక శాఖల సమన్వయంతో నిధుల బదిలీ ప్రక్రియను అమలు చేస్తాయని అధికారులు అన్నారు. విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు మేరకు సమగ్రశిక్షా అభియాన్ నోడల్ ఖాతా ద్వారా ఆయా పాఠాలలకు నేరుగా చెల్లిస్తారు. ఫీజు చెల్లింపు మొత్తాన్ని మినహాయించి మిగతా మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాలో జమచేస్తారు. సామాజిక ఆడిట్‌కోసం లబ్ధిదారుల జాబితాను సచివాలయాల్లో ప్రదర్శనకు ఉంచారు. అర్హత ఉండి ఎవరైనా అనర్హులుగా తిరస్కరిస్తే గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ఎంతో ఆనందంగా ఉంది



ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తల్లికి వందనం నిధులు విడుదల చేయడంపై ఆనందంగా ఉంది. నా ముగ్గురు పిల్లల కోసం రూ.39వేలు వచ్చాయి. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి కింద ఒక్కరికే నగదు ఇచ్చారు. ఇంట్లో ఉన్న పిల్లలందరికీ చంద్రబాబు డబ్బు ఇవ్వడం వారికి భవిష్యత్ కల్పించినట్లే.

- అనూష, భీమవరప్పాడు, కొండాపురం మండలం

చంద్రబాబుకు రుణపడి ఉంటాం



నా భర్త కరీముల్లా బేల్దారి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మాకు ముగ్గురు పిల్లలు. ముజిమిల్ 7వ, సుకూర్ 4వ, వహబ్ 2వ తరగతి చదువుతున్నారు. పిల్లల చదువుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తల్లికివందనం పథకం కింద ఒక్కొక్కరికి రూ.13 వేలు వంతున రూ.39 వేలు నా బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. నిజంగా ఇది ఎంతో వరంతో కూడుకున్నది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటాం.

షేక్ రహిమున్నీసా, దిలావర్‌భాయ్‌వీధి, ఉదయగిరి

భక్తులపాలిట కల్పవల్లి వెంగమాంబ

- రేపటి నుంచి 19 వరకు బ్రహ్మోత్సవాలు
- నర్రవాడలో విస్తృత ఏర్పాట్లు
- సొంతూళ్లకు చేరుకుంటున్న వలసవాసులు



ప్రత్యేక అలంకరణలో వెంగమాంబ దంపతులు



శ్రీ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయం

దుత్తలూరు (ఉదయగిరి), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): భక్తుల పాలిట కల్పవల్లిగా పేరొందిన నర్రవాడలోని శ్రీ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు జరగనున్నాయి. కరువు కోరల్లో చిక్కి జీవనం భృతి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లిన వారంతా ఈ ఉత్సవాలకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ. సుమారు 6 లక్షల మందికిపైగా భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.

వలసవాసుల ఆరాధ్యదైవం

వలసవాసుల ఆరాధ్యదైవంగా వెంగమాంబ పేరంటాలు విరాజిల్లుతోంది. అమ్మవారి సన్నిధిలో నిద్రిస్తే సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. అలాగే, అమ్మవారి సొమ్మును పెట్టుబడిగా వినియోగించడం ఈ ప్రాంతీయులకు వస్తున్న ఆచారం. దేవస్థాన కమిటీ నుంచి కొంత సొమ్మును రుణంగా పొంది ఆ నగదును లావాదేవీల్లో వినియోగిస్తే ఆ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వృద్ధి చెంది సిరిసంపదలు సిద్ధిస్తాయనేది ప్రగాఢ విశ్వాసం. ఉత్సవాలతో నిమిత్తం లేకుండా ప్రతి ఆది, గురువారాల్లో భక్తులు అమ్మవారిని దర్శిస్తారు.

నిలుపుతో ఉత్సవాలు ప్రారంభం

ఈ నెల 15న ఆదివారం నిలుపు, సంతానం లేని వారు వరపడుట, పసుపు దంచే కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 16న గ్రామోత్సవం, సంతానం లేని వరపడుట, 17న గ్రామోత్సవం, 18నఅమ్మవారి కల్యాణం, పసుపు కుంకుమ ఉత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, 19న బండ్లు పొంగళ్లు, రాష్ట్రస్థాయిలో ఎడ్ల బండలాగుడు పందేలా నిర్వహణతో ఉత్సవాలు ముగుస్తాయి.

భక్తులకు ఏలోటూ రానీయం

వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉన్నతాధికారులు, ఆలయ ధర్మకర్తల సూచనలు, సలహాలతో సర్వం సిద్ధం చేస్తున్నాం. మంచినీరు, వైద్య సదుపాయం, పారిశుధ్యంవంటి కార్యక్రమాలతోపాటు పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. భక్తుల రాక కోసం వివిధ మార్గాల్లో ప్రత్యేక బస్సులు నడపనున్నాం. అమ్మవారి దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం.

- వెట్టిగుంట ఉషశ్రీ, ఆలయ ఈవో

రామతీర్థానికి ఉత్సవ శోభ

- 16 నుంచి శివపార్వతుల బ్రహ్మోత్సవాలు
- 24న కల్యాణం, 25న తీర్థవాది
- విస్తృత ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



కామాక్షిదేవి సమేత రామలింగేశ్వర స్వామి



రామలింగేశ్వర స్వామి దేవాలయం

విడవలూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : భక్తులకు కొంగు బంగారంగా వీరాజిల్లుతున్న శ్రీ కామాక్షిదేవి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 16 నుంచి 26వ తేదీ వరకు రామతీర్థంలో జరగనున్నాయి. ఎంతో వైభవంగా జరిగే ఈ ఉత్సవాలకు మన రాష్ట్రం నుంచేగాక తెలంగాణ, తమిళ నాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. ఈ మేరకు ఆలయ అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది.

శ్రీరాముడు ప్రతిష్ఠాపనతో..

త్రేతాయుగంలో శ్రీరాముడు సీతా లక్ష్మణులతో అరణ్యవాసం చేస్తున్నప్పుడు లంకాధీపతి రావణుడు సీతమ్మను అపహరించి లంకకు తీసుకెళతాడు. సీతాన్వేషణకు బయలు దేరిన రామలక్ష్మణులు రామతీర్థం గ్రామానికి చేరుకుని, సూర్యస్తమయం కావటంతో సముద్రతీరాన శయనిస్తారు. సూర్యోదయం కాగానే శ్రీరాముడు సముద్రంలో స్నానాలు ఆచరించి సైకత శివలింగాన్ని ప్రతిష్ఠించి, పూజలు చేస్తారు. ఆనాటి నుంచి ఈ ప్రాంతాన్ని రామతీర్థంగాను, శ్రీరాముడిచే ప్రతిష్ఠించిన శివలింగం కావడంతో రామలింగేశ్వరుడిగా భక్తులు కొలుస్తున్నారు. 14వ శతాబ్దంలో ఈ ప్రాంతాన్ని పాలించిన పల్లవరాజులు స్వామివారికి దేవాలయం నిర్మించి, పూజించారు. 18వ శతాబ్దంలో కోటంరెడ్డి శేషాద్రిరెడ్డి ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేశారు. ఆ తర్వాత 2009లో అల్తూరి ఆదినారాయణరెడ్డి-సులోచనమ్మలు ఆలయాన్ని పునఃనిర్మించారు.

ఉత్సవాలు ఇలా...

శ్రీ కామాక్షిదేవి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో తొలిఘట్టమైన అంకురార్పణ 16వ తేదీన జరగనుంది. 17న ధ్వజారోహణం, 18న చిలక వాహనం, 19న హంస వాహనం, 20న పులి వాహనం, 21న రావణ సేవ, 22న నందిసేవ, 23న స్వామి వారి రథోత్సవం, 24న ఆదిదంప తుల కల్యాణం, గజ వాహనంపై స్వామివారు విహరిస్తారు. 25న తీర్థవాది (సముద్ర స్నానం), తెప్పోత్సవం, పారువేట, గుర్రపు వాహనం, 26న ధ్వజావరోహణం, స్వామి, అమ్మవార్ల ఏకాంత సేవతో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలు ప్రారంభ, ముగింపు నాడు పల్లవుల కాలం నాటి 200 కిలోల కంచు గంటను మోగిస్తారు. వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తజనం రామతీర్థానికి చేరుకుని మొక్కులు తీర్చుకుంటారు. కాగా, కల్యాణోత్సవం నాడు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పాల్గొని ఉత్సవర్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

సమన్వయంతో బ్రహ్మోత్సవాల నిర్వహణ

రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సహాయ సహకారాలు, సూచనలు తీసుకుని దాతలు, భక్తులు, మండలాధికారుల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రయత్నిస్తాము. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాము. ఇప్పటికే రెవెన్యూ, పోలీసు, వైద్య, అగ్ని మాపక శాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించాము.

- మల్లికార్జునరెడ్డి, ఆలయ ఈవో

ముమ్మర ఏర్పాట్లు

రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ పరిసరాలను వివిధ రంగులతో శోభాయమానంగా తీర్చిదిద్ది, ఉత్సవ వాహనాలను అందంగా ముస్తాబు చేశారు. భక్తుల సౌకర్యార్థం మంచినీరు, తాత్కాలిక గదులు, మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. నెల్లూరు, కావలి నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

తాత్కాలిక టోల్ గేట్ ఏర్పాటుకు 16న వేలం

విడవలూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో జరగనున్న కామాక్షిదేవి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే ప్రైవేట్ వాహనాలకు 23 నుంచి 26వ తేదీ వరకు పార్కింగ్ రుసుం వసూలు చేసుకొనేందుకు (తాత్కాలిక టోల్ గేట్) ఈనెల 16న గ్రామ సచివాలయంలో ఉదయం 11గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి సుమంత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే వారు రూ.2వేలు దరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9574
వెండి కిలో ధర	రూ. 109200
వెండి ఒక గ్రాము	రూ. 112.20

రైతులకు త్వరగా ఈకేవైసీ చేయించాలి

వెంకటాచలం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతు సేవా కేంద్రంలో శుక్రవారం గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ శాఖాధికారి హరి కరుణాకర్‌రెడ్డి విచ్చేసి మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులకు త్వరగా ఈకేవైసీ చేయించాలని, పేర్లు రాని రైతుల వివరాలు సేకరించి ఆ జాబితాను తమకు అందజేయాలని సూచించారు. పీఎం కిసాన్ పథకంలో అర్హులైన రైతులను నమోదు చేయించాలని కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

మనుబోలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ ఏఈ. అనీల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆరు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున మండలంలోని 19 పంచాయతీల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

తోటపల్లిగూడూరు: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం మండలంలోని 33 కేవీ ఫీడర్ పరిధిలోని తోటపల్లిగూడూరు, ఈదూరు, వరకవిపూడి, అనంతపురం, సాలిపేట, పేడూరు, పాపిరెడ్డిపాలెం గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బి.సుకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

రాపూరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ కార్తీక్ తెలిపారు.

ఇందుకూరుపేట : మండలంలోని అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఇందుకూరుపేట సబ్ డివిజన్ డీఈ సురేంద్రబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు. .

కొడవలూరు : మండలంలోని గండవరం విద్యుత్ స్టేషన్‌లో మరమ్మతులు నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీ వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నిధులు మంజూరయ్యేనా..
నిర్మాణం పూర్తయ్యేనా ?

- అసంపూర్తిగా స్త్రీశక్తి భవనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు


ముత్తుకూరులో అసంపూర్తిగా ఉన్న స్త్రీశక్తి భవనం

ముత్తుకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నిధుల కొరతతో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో అసంపూర్తిగా భవనాల నిర్మాణాలను పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. స్వయం సహాయక సంఘాల కార్యకలాపాల కోసం నిర్మించిన స్త్రీ శక్తి భవనం ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉంది. -

బిల్లులు రాక అసంపూర్తిగా..

ముత్తుకూరులో మండల కార్యాలయాల సమీపంలో పొదుపు సంఘాల కార్యకలాపాల కోసం కార్యాలయ భవన నిర్మాణానికి గత టీడీపీ పాలనలో శ్రీకారం చుట్టారు. స్త్రీ శక్తి భవనం పేరుతో రెండంతస్తుల భవన నిర్మాణానికి రూ.32లక్షల వ్యయంతో పనులు ప్రారంభించారు. కింద అంతస్తు నిర్మాణానికి రూ.25లక్షలు, మొదటి అంతస్తు నిర్మాణం కోసం రూ.7లక్షలు కేటాయించారు. అప్పట్లో కాంట్రాక్టరు కింద అంతస్తు పూర్తి చేసి, రెండో అంతస్తు పనులను ప్రారంభించారు. బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. అప్పటి నుంచి ఈ భవనం అసంపూర్తిగానే ఉంది. గత వైసీపీ పాలనలో స్త్రీ శక్తి భవన నిర్మాణం గురించి అటు ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదు. పూర్తయిన కింద అంతస్తునే పొదుపు కార్యాలయంగా వాడుకుంటున్నారు. బిల్లులు వస్తే మొదటి అంతస్తు పూర్తి చేస్తే, పొదుపు సంఘాల కార్యకలాపాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే ప్రజాప్రతినిధులు, అధికారులు ఎందుకనో ఈ భవన నిర్మాణంపై శ్రద్ధ చూపడంలేదు. అందువల్లే ఏళ్ల గడుస్తున్నా నేటికీ పూర్తి నిర్మాణానికి నోచుకోలేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని నిధులు మంజూరు చేస్తే స్త్రీ శక్తి భవనం పొదుపు సంఘాలకు అందుబాటులోకి రానున్నది.

బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


రామతీర్థం బ్రహ్మోత్సవాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నాయకులు

విడవలూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థంలో జరగనున్న కామాక్షిదేవి సమేత రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన గోడపత్రిక, కరపత్రాలను నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో శుక్రవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దక్షిణ కాశీగా పిలువబడుతున్న రామతీర్థం బ్రహ్మోత్సవాలకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. లక్షలాదిమంది భక్తులు వస్తారని, అందుకు అనుగుణంగా పోలీసులు, రెవెన్యూ, వైద్యశాఖ, అగ్నిమాపక, ఆలయాధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా స్వామివారి కల్యాణం, తీర్థవాదిరోజున భక్తులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సముద్ర తీరంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మల్లికార్జునరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ సురేష్, నాయకులు ఆవుల వాసు, పురిణి హరి, రాగాల వెంకటరమణ, నాటారు విజయకుమార్, కొండూరు శ్రీధర్, పొన్నాడి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


రాజుపాలెంలో నిర్మించిన గోకులం షెడ్డు

గోకులం షెడ్లకు బిల్లులు రాక ఇక్కట్లు

- గత అక్టోబరులో నిర్మాణం
- నేటికీ నిధులు మంజూరు కాని వైనం

కొడవలూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నది. ఈ క్రమంలో రహదారుల నిర్మాణం, ఇంకుడు గుంతలు, పాడి రైతులకు ఉపయోగపడే గోకులం షెడ్ల నిర్మాణం, మొక్కలు పెంపకానికి పెద్ద పీట వేస్తున్నది. ఈ నేపథ్యంలో గత ఏడాది అక్టోబరులో ఉపాధి హామీ నిధుల ద్వారా పాడి రైతులకు గోకులం షెడ్ల నిర్మాణాలు చేపట్టింది. మండలంలో గ్రామాల వారీగా షెడ్లు మంజూరు చేసి, పశు సంవర్థక శాఖ ఉపాధి హామీ సిబ్బంది కలిసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. రూ.2.30లక్షలను ఒక్కో షెడ్డు నిర్మాణానికి చేశారు. ఇక పనులు చేయడమే ఆలస్యంగా వెంటనే బిల్లులు మంజూరవుతాయని క్షేత్రస్థాయి సిబ్బంది రైతులు వెంటపడ్డారు. వారు అప్పులు చేసి మరీ రూ.లక్ష నుంచి రూ.1.8లక్షలు వెచ్చించి షెడ్లు నిర్మించారు. మండలానికి 23 షెడ్లు మంజూరు కాగా, ఆలూరుపాడు, దామేగుంట, గండవరం, గౌతమినగర్, కొత్తవంగల్లు, రాజుపాలెం, పెమ్మారెడ్డిపాలెం, మానేగుంటపాడు, వెంకన్నపురం, రామన్నపాలెం గ్రామాల్లో ఒక్కొక్కటి, సౌత్ హరిజనవాడ రెండు, యల్లాయపాలెం 2, కమ్మపాలెం 3 షెడ్లు నిర్మించారు. నిర్మించి నెలలు గడుస్తున్నా ఇంత వరకు వాటికి బిల్లులు రాక రైతులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, బిల్లులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

బాలకార్మికుడికి విముక్తి


కోవూరులో తనిఖీలకు వచ్చిన జిల్లా బాలకార్మిక టాస్క్‌ఫోర్సు కమిటీ ప్రతినిధులు

కోవూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక బజారు కూడలిలోని ఓ దుకాణంలో పనిచేస్తున్న ఓ బాలకార్మికుడికి జిల్లా బాలకార్మిక టాస్క్‌ఫోర్సు కమిటీ శుక్రవారం విముక్తి కల్పించారు. పట్టణంలో జిల్లా బాల కార్మిక టాస్క్‌ఫోర్సు కమిటీ, జిల్లా కార్మికశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికశాఖ సహాయ కమిషనర్ ఎస్‌కే గౌస్ మాట్లాడుతూ బాలకార్మికులతో పనిచేయించుకునే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఓ దుకాణంలో పనిచేస్తున్న ఓ బాలకార్మికుడ్ని స్వాధీనం చేసుకుని యజమానిపై పోలీసు కేసు నమోదు చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, స్వచ్ఛందసేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జనసేన క్రియాశీలక సభ్యులకు కిట్ల పంపిణీ


సభ్యులకు కిట్లను అందజేస్తున్న సురేష్‌నాయుడు

ముత్తుకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైనాపురంలో శుక్రవారం సర్వేపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు క్రియాశీలక సభ్యులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో భాగస్వాములైన వారికి క్రియాశీలక సభ్యత్వాన్ని అందిస్తున్నామన్నారు. సభ్యత్వాలకు సంబంధించిన ఐడీ కార్డు, ధ్రువపత్రం ఇవ్వడంతో పాటు జనసేన పార్టీ అండగా ఉంటుందనే భరోసా ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తుకూరు మండల సీనియర్ నాయకులు రహీం, బోలా అశోక్, సుమన్, మల్లి, చిన్న, స్థానిక నాయకులు కావలి మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారుల నుంచి సాగు భూములను కాపాడండి

- తహసీల్దారుకు దళితుల వినతి


తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న కృష్ణపట్నం గ్రామస్థులు

ముత్తుకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సముద్ర తీరప్రాంతం వెంబడి ఏళ్ల తరబడి తాము సాగుచేసుకుంటున్న భూములను ఆక్రమణదారుల నుంచి కాపాడాలని కోరుతూ కృష్ణపట్నంకు చెందిన దళితులు మాజీ సర్పంచ్ మొలకమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దారు స్వప్నకు వినతిపత్రం అందజేశారు. చాలాకాలంగా ఈభూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, కొంతమంది ఆక్రమించి భూముల్లో చేస్తున్న పనులను తక్షణమే నిలిపివేయాలని ఆమెను కోరారు. దీంతో తహసీల్దారు స్వప్న మాట్లాడుతూ సమస్యపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని, వివాదాలు పెట్టుకోకుండా సామరస్యంగా ఉండాలని సూచించారు. అక్కడ జరుగుతున్న పనులను నిలిపివేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యలు తీసుకెళ్తామన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దంపతులకు స్వాగతం పలుకుతున్న వెడిచెర్ల వెంకటరమణారెడ్డి దంపతులు

మనుబోలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగితాలపూరు గ్రామంలో మహాలక్ష్మమ్మ ఉత్సవాలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కుమారుడు రాజగోపాల్‌రెడ్డి, ఆయన సతీమణి శృతిరెడ్డి శుక్రవారం విచ్చేశారు. వినాయక, మహాలక్ష్మమ్మ, అంకమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అన్నసంతర్పణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. వారికి గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు వెడిచెర్ల వెంకటరమణారెడ్డి దంపతులు స్వాగతం పలికారు. అనంతరం టీడీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ చెల్లగిరి చిట్టిబాబు ఇంటికి వెళ్ళి పరామర్శించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, పొన్నూరు రామకృష్ణయ్య, మధునాయుడు, గోను దశయ్య, వేమా కిరణ్, వెడిచెర్ల దినేష్‌రెడ్డి, పచ్చిపాల రామిరెడ్డి, సూరిశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారిపాలెంకు సోమిరెడ్డి రాక

పొదలకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవారిపాలెం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం సాయంత్రం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభోత్సవం చేస్తారని మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు శుక్రవారం తెలిపారు. మండలంలోని తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఇంటివద్దకే రేషన్ ఇవ్వాలి : ఐద్వా

నెల్లూరు(హరనాథపురం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటి వద్దకే రేషన్ సరకులు ఇవ్వాలని ఐద్వా నాయకులు డీఎస్వో కార్యాలయం ఎదుట శుక్ర వారం ధర్నా చేశారు. అనంతరం ఏఎస్‌వో అంకయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తానమ్మ మాట్లాడుతూ డీలర్ల ద్వారా సరకులు తీసుకోవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎండీ యూ వాహనాల ద్వారాగానీ, డీలర్ల ద్వారాగానీ ఇంటి వద్దకే రేషన్ సరు కులు చేర్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరిగెల రమమ్మ, శివ కుమారి, ఎం పుల్లయ్య, వెంకమ రాజు తదితరులు పాల్గొన్నారు.

పలువురు అధికారుల బదిలీలు

- పశ్చిమగోదావరి జడ్పీ సీఈవోగా ఎంపీడీవో

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. ఎంపీడీవో శ్రీహరి పదోన్నతిపై పశ్చిమగోదావరి జడ్పీ సీఈవోగా పదోన్నతిపై బదిలీ కాగా ఆయన స్థానంలో ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ తహసీల్దారు సునీల్‌కుమార్ స్పెషల్ కలెక్టర్ తెలుగు గంగ ప్రాజెక్టుకు బదిలీ అయ్యారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దారు పీ.కామాక్షి పదోన్నతిపై తెలుగుగంగ ప్రాజెక్టుకు, ఆర్ఐ. ఎం.రమణయ్య కోవూరు ఎన్నికల సీనియర్ అసిస్టెంటుగా, ఏఎస్‌వో కేవీ.రామ్మోహన్ రావు కోవూరు ఏఎస్‌వోగా బదిలీ అయ్యారు. మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి ఇందుకూరుపేట వ్యవసాయశాఖ టెక్నికల్ అధికారిగా బదిలీ కాగా ఆయన స్థానంలో సంగం మండలం వ్యవసాయాధికారిని నియమించారు.

ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల అందజేత


సీఆర్‌సీకి అందజేసిన ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లు

వెంకటాచలం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరస్వతి నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో శుక్రవారం ఎనిమిది ఎలక్ట్రికల్ ట్రైసైకిల్స్‌ను దివ్యాంగుల ప్రాంతీయ కేంద్రానికి అందజేశారు. అధ్యయన కేంద్రం సంచాలకులు ప్రొఫెసర్ మాడభూషి సంపత్‌కుమార్ మాట్లాడుతూ ట్రైసైకిల్స్‌ను సీఆర్‌సీ ద్వారా దివ్యాంగులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌సీ అధికారులు, అధ్యయన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వేలాడుతున్న విద్యుత్ స్తంభం

- గాలి వీచిందా... గోవిందా...


అడుగుభాగం లేని విద్యుత్ స్తంభం

మనుబోలు, జూన్ 13 (ఆంధ్ర జ్యోతి): మనుబోలు-పొదలకూరు మార్గంలోని వీరంపల్లి సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం అడుగు భాగం లేకుండా వేలాడుతోంది. దీంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వచ్చేది వర్షాకాలం. ఈదురు గాలులు వీచి స్తంభం నేలకు వాలిందంటే ప్రాణాపాయం తప్పదని, విద్యుత్ అధికారులు తక్షణమే స్పందించి వేలాడుతున్న విద్యుత్ స్తంభాన్ని మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

C.R.I.M.E N.E.W.S

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన వాహనం

సంగం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుచ్చిరెడ్డిపాళెం టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం ఉదయం సంగం పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. చేజర్ల మండలం నాగులవెల్లటూరు నుంచి రేషన్ బియ్యాన్ని ఓ వాహనంలో బుచ్చిరెడ్డిపాళెంలోని ఓ రైస్ మిల్లుకు తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు బుచ్చి టోల్‌ప్లాజా వద్ద వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో సుమారు రెండున్నర టన్నుల రేషన్ బియ్యం ఉండడంతో వాహనాన్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ రిపేరు విషయంలో గొడవ

- ఒకరిపై కత్తితో దాడి

నెల్లూరు(క్రైం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని మూలపేట రావిచెట్టు సెంటర్‌లో బైక్ మెకానిక్ షాపు వద్ద ఓ వ్యక్తి కత్తితో దాడి చేసి పరారయ్యాడు. పోలీసుల కథనం మేరకు... మూలాపేట రాజాగారి వీధికి చెందిన వెంకటేష్ బావ కృష్ణ రావిచెట్టు సెంటర్‌లో బైక్‌మెకానిక్ షాపు నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం వెంకటేష్ ఆ షాపు వద్దకు వెళ్లాడు. అదే సమయంలో ఇరగాళమ్మ సంఘానికి చెందిన వేణు అనే వ్యక్తి వచ్చి బైక్ రిపేరు చేయమని అడిగాడు. కావలసిన వస్తువులు తెచ్చుకుంటే రిపేరు చేస్తామని కృష్ణ చెప్పగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో అక్కడే ఉన్న వెంకటేష్, షాపులో పనిచేసే హరీష్ కలిసి సర్దిచెప్పారు. అనంతరం అక్కడ నుంచి వెళ్లిపోయిన వేణు, కొద్దిసేపటి తర్వాత మరో బైక్‌పై వచ్చి కత్తితో మెకానిక్ కృష్ణపై దాడి చేయబోయాడు. అడ్డుపోయిన వెంకటేష్ చేతికి గాయమైంది. చుట్టుప్రక్కల వారు రావడంతో వేణు అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడ్డ వెంకటేష్‌ను నగరంలోని రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించారు. బాధితుడు శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తాపడి మహిళ మృతి

- ఆరుగురికి గాయాలు


బోల్తాపడిన ఆటో

వెంకటాచలం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వేపల్లి సమీపంలో మల్లుగుంట సంఘం వద్ద శుక్రవారం ఉదయం ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో ఒక మహిళ అక్కడికక్కడే మృతిచెందగా ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇడిమేపల్లి పంచాయతీ పలుకూరివారిపాళెంకు చెందిన ఆటోడ్రైవర్ చల్లా హరిబాబు తన ఆటోలో నారేత వేసేందుకు ఆప్రాంతం నుంచి మహిళా కూలీలతో పొట్టెంపాడు గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో మల్లుగుంట సంఘం వద్దకు వచ్చేసరికి అక్కడ ఉన్న మలుపులో మోటార్‌బైక్ రావడంతో తప్పించబోయి ఆటో బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పలుకూరివారిపాళెనికి చెందిన మల్లి లక్ష్మీదేవి (59) అక్కడికక్కడే మృతిచెందగా, చల్లా రమణమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను సమీపంలోని సర్వేపల్లికి తీసుకెళ్లగా అక్కడినుంచి 108 వాహనంలో నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సోమిరెడ్డి పరామర్శ




కాగా, రోడ్డు ప్రమాద బాధితులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరామర్శించారు. నెల్లూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వద్దకు వెళ్లి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన సవరం చిన్నలక్ష్మయ్య

సీతరామపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగనాయుడుపల్లి గ్రామ ఎస్టీ కాలనీకి చెందిన సవరం చిన్న లక్ష్మయ్య (35) శుక్రవారం ఆర్థిక సమస్యల కారణంగా మద్యంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు... సవరం లక్ష్మయ్య తరచూ మద్యం సేవిస్తుండడంతో అప్పులు పెట్టుకుని తాగడం ఏమిటని కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. దీంతో చిన్న లక్ష్మయ్య అతిగా మద్యం సేవించి ఇంటి ముందు పడిపోవడంతో కుటుంబ సభ్యులు ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

పెన్నాలో గుర్తుతెలియని మృతదేహం


పెన్నానదిలో లభ్యమైన గుర్తుతెలియని మృతదేహం

నెల్లూరు(క్రైం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని తిక్కన పార్క్ వద్ద పెన్నానదిలో గుర్తు తెలియని మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. రంగనాయకులపేట ఇసుకడొంక 52-1 సచివాలయం వార్డ్ రెవెన్యూ సెక్రెటరీ ఎస్‌కే సందాని బాషాకు సమాచారం అందించారు. ఆయన అక్కడికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంతపేట పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. 35-40 సంవత్సరాల మధ్య వయస్కుడి మృతదేహం నీటిలో బోర్లా పడి ఉంది. మృతుడు ఎవరని తెలుసుకునే ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా కిడ్నాపర్ అరెస్ట్ : ఇద్దరు చిన్నారులు తల్లి చెంతకు

నెల్లూరు(క్రైం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళా కిడ్నాపర్ చెరలో నుంచి ఇద్దరు చిన్నారులను సంరక్షించిన పోలీసులు ఆ పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. నవాబుపేట పోలీసు స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఇన్‌స్పెక్టర్ జీ వేణుగోపాల్‌రెడ్డి వివరాలను మీడియాకు వెల్లడించారు. నెల్లూరు రూరల్ మండలం కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో నివసించే కృష్ణ, శీనమ్మ దంపతులకు కుమార్తె చంద్రమ్మ, కుమారుడు సూర్య సంతానం. ఈ నెల 8వ తేదీన శీనమ్మ తన ఇద్దరు పిల్లలను తీసుకుని మైపాడు బీచ్‌కు వెళ్లింది. మధ్యాహ్నం వరకు అక్కడే ఉండి నెల్లూరుకు వచ్చింది. శెట్టిగుండరోడ్డు వద్ద ఆటో కోసం ఎదురు చూస్తుండగా చిన్నారులు అదృశ్యమయ్యారు. పిల్లల కోసం తల్లి ఎంత గాలించినా ప్రయోజనం లేకపోవడంతో నవాబుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తన సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ ఫుటేజీలు పరిశీలించగా కావలి మండలం చలమచర్ల గ్రామానికి చెందిన పీ జాలమ్మ అనే మహిళ పిల్లలను తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఆమె కోసం గాలించారు. శుక్రవారం కావలి జేబీ కళాశాల గేటు వద్ద ఆమెను అదుపులోకి తీసుకుని చిన్నారులను సంరక్షించారు. నిందితురాలిని స్టేషన్‌కు తరలించి తమదైన శైలిలో విచారించగా బాతులు మేపుకునేందుకు చిన్నారులను తీసుకెళ్లినట్లు అంగీకరించింది. దీంతో పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. పిల్లలను వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించడంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ రెహమాన్, సిబ్బంది టీవీ నరసయ్య, ఎన్ ప్రసాద్, ఆర్‌వీ రత్నయ్య, టీ మస్తాన్‌రావు, ఎం వేణు, జీ మస్తానయ్య, ఎస్‌కే గౌస్‌బాషాను ఎస్పీ అభినందించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	238

కోడిగుడ్ల ధర (100): 535



భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం రాహుకాల పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం కుంభ హారతులు, పల్లకీసేవ జరిగాయి. ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

న్యూస్ బాక్స్

ముగిసిన పవిత్రోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామికి నవకలిక స్నపన తిరుమంజనం కన్నుల పండువగా జరిగింది. వివిధ రకాల పుష్పాలంకారం, విశేష పూజలు, ఆస్థాన సేవ, శాత్తుముర్రై జరిగాయి. ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు (జడ్పీ), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రేబాల వారి వీధి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, ఉస్మాన్‌సాహెబ్ పేట, రాంనగర్ ఫీడర్స్‌లో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్రాహ్మణ వీధి, పుట్ట వీధి, ఎన్టీఆర్ లేఅవుట్, రాంనగర్, మసీద్ సెంటర్, ఏసీ నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

● హరనాథపురం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా హరనాథపురం, పినాకినీ అవెన్యూ, ఆకుతోట, సర్వేపల్లి కాలువ కట్ట, చిల్డ్రన్స్ పార్క్ ప్రాంతం, అయోధ్య నగర్, మధురా నగర్, అపోలో ఆసుపత్రి, బలిజపాళెం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

● బీవీ నగర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మాగుంట లేఅవుట్, లెక్చరర్స్ కాలనీ, మినీ బైపాస్ రోడ్డు, రవీంద్ర నగర్, ఉమారెడ్డి గుంట, వనంతోపు, సంఘమిత్ర స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

● వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ వంతెన దగ్గర రోడ్డు వెడల్పు చేస్తున్నందున విద్యుత్ స్తంభాలు పక్కకు మార్చడం కోసం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

● యనమలవారిదిన్నె సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా యనమల వారి దిన్నె, పద్మావతి గ్రీన్ సిటీ, వడ్డి పాళెం, బలిజపాళెం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, శెట్టిగుంటరోడ్డు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శ్రీనివాసనగర్, జాకీర్ హుస్సేన్ నగర్, కిసాన్ నగర్, సింహపురి కాలనీ, మైపాడు రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

బుజబుజ నెల్లూరులో తీరనున్న విద్యుత్ సమస్యలు

నెల్లూరు(విద్య), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బుజబుజ నెల్లూరులో విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు అడుగులు ముందుకు వేశారు. ఆ ప్రాంతంలో విద్యుత్ సమస్యలపై ఇటీవల ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం ప్రచురించడంతో స్థానిక నాయకులు స్పందించారు. టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి నేతృత్వంలో శుక్రవారం విద్యుత్ శాఖ ఎస్ఈ కే విజయన్‌ను కలిసి చర్చించారు. సమస్యల పరిష్కారానికి సుమారు రూ.1.40కోట్లు అవసరమని అధికారులు తెలపడంతో నిధుల విడుదలకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి, డివిజన్ ఇన్‌చార్జి బోనుబోయిన ఆది శేషయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి పిగిళం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనం.. అసలైన ఆనందం



తల్లికి వందనం సంబరాల్లో పిల్లలతో సుబ్బారావు తదితరులు

నెల్లూరు (వైద్యం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం అర్హులైన తల్లులకు అసలైన ఆనందమని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు అన్నారు. తల్లికి వందనం పథకం నిధుల విడుదల సందర్భంగా శుక్రవారం నగరంలోని కుక్కలగుంట, కామాటి వీధి సచివాలయాల వద్ద విద్యార్థులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. నగరంలోని 47వ డివిజన్‌లో 1000 మంది తల్లుల ఖాతాల్లో నగదు జమ అయిందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్‌కుమార్, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రొట్టెల పండుగ అంటే పండగే!

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బారా షహీద్ దర్గా వద్ద జరిగే ప్రసిద్ధ రొట్టెల పండుగ అంటే భక్తులకే కాదు కొందరు అధికారులు, కాంట్రాక్టర్లకు కూడా ఏటా పండుగే!. 400 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ పండుగను ఎనిమిదేళ్లగా రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు. ఏటా దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది తరలివస్తారు. ఇక్కడి స్వర్ణాల చెరువులో కోర్కెల రొట్టెలు పట్టుకుం టారు. అయితే ఏడాదంతా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాల్సిన ఈ ప్రదేశాన్ని పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. రొట్టెల పండుగ సీజన్‌లో మినహాయిస్తే మిగిలిన కాలంలో పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారవుతోంది. బారాషహీద్ దర్గా పరిసరాలు, స్వర్ణాల చెరువు ఘాట్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతున్నాయి. ప్రస్తుతం బారాషహీద్ దర్గా, ఇతర ఉప దర్గాలతోపాటు మైదానం అంతా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. సగానికి పైగా దీపాలు వెలగడంలేదు. సోలార్ లైట్లు పనిచేయడం లేదు. ఆ ప్రాంతంలో నిర్మించిన మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో కొళాయిలు, ఫ్లోరింగ్, తలుపులు వంటివి దెబ్బతిన్నాయి. చెరువు, చెరువు ఘాట్‌ను అధికారులు పట్టించుకోకపోవడంతో గుర్రపు డెక్కతో నిండి పోయింది. ఆహ్లాదానికి బదులు ఈ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ ప్రాంతంలో ఘాట్ నిర్మించినప్పుడు అందమైన గ్రీనరీతో పార్కు ఏర్పాటు చేశారు. నిర్వహణ లోపం కారణంగా ఆ గ్రీనరీ మాయమైపోయింది. పార్కు అధ్వానంగా మారింది.

● **26న నిషాన్**

రొట్టెల పండుగ ఏర్పాట్లకు ఈ నెల 26 నిషాన్ (జెండా ప్రతిష్ఠ) చేస్తారు. జూలై 6వతేదీ సందల్ మాలి (దర్గాను శుభ్రం చేసి గంధం ఎక్కిస్తారు). 7వతేదీ గంధమహోత్సవం, 8వతేదీ రొట్టెల పండుగ, 9వతేదీ తహలీల్ ఫాతేహా, 10వతేదీ ముగింపు కార్యక్రమం జరగనున్నాయి.



బోటింగ్ పాయింట్ వద్ద పడవలు కదల్లేనంతగా కమ్ముకున్న గుర్రపుడెక్కాకు



స్వర్ణాల చెరువంతా నిండి ఘాట్‌పైకి విస్తరించిన గుర్రపుడెక్కాకు

- చెత్తకుండీలా బారాషహీద్ దర్గా మైదానం
- గుర్రపు డెక్కతో నిండిన స్వర్ణాల చెరువు ఘాట్
- పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రజా ధనం వృథా

ఏటా రూ.లక్షలు ఖర్చు... నాణ్యత లేని పనులు

రొట్టెల పండుగ వస్తోందంటే కొందరు కాంట్రాక్టర్లు, అధికారులకు పండుగనే చెప్పాలి. పండుగకు వచ్చే యాత్రికులకు మౌలిక సదుపాయాల కల్పన పేరిట రూ.లక్షలు ఖర్చు చేస్తారు. ఈ పనులకు కూడా సక్రమంగా టెండర్లు పిలవరు. పైగా పనులు హడావిడిగా చేస్తారు. కనీసం రొట్టెల పండుగకు 30 రోజుల ముందు నుంచి పనులు చేపడితే ఎక్కడైనా నాణ్యత లోపాలు ఉన్నా సరిదిద్దుకునే అవకాశ ఉంటుంది. కానీ ఏటా 10రోజుల ముందు మాత్రమే ప్రారంభించి పైపై పూతల పనులు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నా రు. ఫలితంగా ప్రతి సంవత్సరం రూ.లక్షల్లో ప్రజాధనం వృథా అవుతోంది.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న ఎస్బీఐ ఉద్యోగులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ప్రాణదానంతో సమానమని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత అన్నారు. శుక్రవారం ఎస్‌బీఐ 70వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా రంగనాయకుల పేటలోని బ్యాంకు ప్రాంతీయ కార్యాలయ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రక్తదానంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆర్‌ఎం మురళీ నాయక్, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో పలువురికి వీడ్కోలు



డీడీ మాధురికి మొక్క అందచేస్తున్న ఎగ్జామినర్ మహ్మద్ రఫీ

నెల్లూరు(సిటీ), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నగర పాలక సంస్థ కార్యాలయంలో వివిధ హోదాల్లో పని చేస్తున్న పలువురు అధికారులు బదిలీ కావడంతో వారందరినీ శుక్రవారం సత్కరించి వీడ్కోలు పలికారు. సర్వేయర్‌గా ఉన్న సోమేశ్వరరావు, ఉద్యాన ఏడీ ప్రదీప్‌కుమార్, ఎగ్జామినర్ మహ్మద్ రఫీని ఘనంగా సన్మానించారు. కాగా, కార్పొరేషన్ ఉద్యాన ఏడీగా బీఎంవీ నరసింహా రావు, ఇంజనీరింగ్ విభాగం ఇన్‌చార్జి ఈఈగా అనిల్ కుమార్, ఏఈగా అర్పిత, ఏసీపీగా రఘునాథరావు, ఎగ్జామినర్ ఎఫ్ఏసీగా సింహాద్రి బాధ్యతలు స్వీకరించారు. వీరందరికి కమిషనర్ నందన్, అమృత్ పథకం డీడీ మాధురి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, కార్పొరేషన్‌లో నిర్వహిస్తున్న యోగాంధ్ర పోటీల్లో శుక్రవారం 60 మంది పాల్గొనగా వారిలో ఆరుగురు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకూ పంపనున్నట్లు కమిషనర్ తెలిపారు.

వైసీపీ నగర అధ్యక్షుడిగా శ్రీనివాస్ యాదవ్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నగర అధ్యక్షుడిగా బొబ్బల శ్రీనివాస్ యాదవ్‌ను నియమిస్తూ శుక్రవారం ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. శ్రీనివాస్ ప్రస్తుతం నగరంలోని 37వ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్నారు.

ఇక పంచాయతీలకు గ్రేడ్‌లు!

(5వ పేజీ తరువాయి)

వ్యవస్థను తొలగించాలని నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా ప్రతి జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపాలని కోరారు.

● **ప్రభుత్వానికి చేరిన ప్రతిపాదనలు**

ప్రభుత్వ సూచనలతో పంచాయతీ అధికారులు నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. జిల్లాలో 722 పంచాయతీలు ఉండగా వాటిలో కోటి ఆదాయం కలిగి 10వేల జనాభా ఉన్న పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పరిధిలోకి వస్తాయి. అలాంటి పంచాయతీలు జిల్లాలో 15 ఉన్నట్లు లెక్క తేల్చారు. 50లక్షలు ఆదాయం కలిగి 5వేల నుంచి 10వేలలోపు జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడ్-1గా తేలుస్తూ 73 పంచాయతీలు ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. 2వేల నుంచి 5వేలలోపు జనాభా ఉన్న పంచాయతీలు గ్రేడ్-2 కిందకి రానున్నాయి. ఇవి 183 పంచాయతీలు ఉన్నాయి. ఇక 2వేలలోపు జనాభా కలిగిన పంచాయతీలు 451 ఉన్నాయి. వాటి వివరాలను ప్రభుత్వానికి పంపారు. క్యాబినేట్‌లో ఆమోద ముద్ర పడగానే పంచాయతీలకు గ్రేడ్‌ల వ్యవస్థ ఏర్పాటు కానుంది. అలాగే ప్రతి పంచాయతీకి ప్రత్యేకంగా ఓ కార్యదర్శి ఉండనున్నారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి

నెల్లూరు(క్రైం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారికి జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం రాత్రి నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళ కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పాల్గొన్నారు, ఆయన మాట్లాడుతూ విమాన ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ప్రయాణికులేకాకుండా వైద్య విద్యార్థులు మరణించడం బాధాకర మన్నారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని దేవుడ్ని కోరుకుంటూ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు.



విమాన ప్రమాద మృతులకు నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : స్వంత ఇల్లు లేని అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం నగరంలోని ఆమె నివాసంలో రెవెన్యూ అధికారులతో సమీక్ష జరిపారు. కోవూరు నియోజకవర్గంలో ఇళ్ల స్థలాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారని, వారిలో అర్హులను గుర్తించి స్థలాలు మంజూరు చేయాలని కోరారు.



చెత్త... రోడ్డెక్కుతోంది!

నగరం నుంచి పొట్టేపాళెం వెళ్లే మార్గంలో ప్రధాన రహదారి వెంబడి భారీగా చెత్త పేరుకుంటోంది. కొంతకాలంగా ఇక్కడ పోస్తున్న చెత్త ఎక్కువై మినీ డంపింగ్ యార్డులా తయారైంది. గుట్టలుగా పేరుకున్న చెత్త క్రమం గా రోడ్డు మీదకు విస్తరిస్తోంది. వ్యర్థాలను పందులు, ఇతర మూగజీవాలు లోడి రోడ్డు మీదకు తోస్తున్నాయి. దీని వల్ల దుర్వాసన వ్యాపిస్తోంది. వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. నగరంలో ఇళ్ల నుంచే వ్యర్థాలు సేకరిస్తున్నామని నగరపాలక యంత్రాంగం చెబుతుంటే ఇంత భారీ స్థాయిలో రోడ్డు పక్కన చెత్తను ఎవరు పోస్తున్నారనేది ప్రశ్నార్థకం. అధికారులు పట్టించుకుని చెత్త కుప్పలు తొలగించాల్సిన అవసరం ఉంది.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్



'వీపీఆర్'లో విలువలతో కూడిన విద్య

● కిట్ల పంపిణీలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



నెల్లూరు(హరనాథపురం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : విలువలతో కూడిన విద్యను అందించటమే వీపీఆర్ విద్య పాఠశాల లక్ష్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శుక్రవారం కనుపర్తిపాడులోని ఆ పాఠశాలలో స్కూల్ కిట్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ 2016లో స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు పేద పిల్లలకు మంచి విద్యను అందిస్తున్నామని చెప్పారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థుల ఉన్నత విద్యకు కూడా వీపీఆర్ ఫౌండేషన్ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

● రూరల్ ఎమ్మెల్యేకి వినతి



ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న కార్మిక సంఘం నాయకులు

నెల్లూరు(సిటీ), జూన్13 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఆ మేరకు ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరుతూ కార్మిక సంఘం నాయకులు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఎమ్మెల్యేను శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిశారు. కార్మికులకు ఉద్యోగ విరమణ వయో పరిమితిని 62 ఏళ్లకు పెంచాలని, ఉద్యోగ విరమణ ప్రయోజనాలను కల్పించాలని కోరారు. నైపుణ్యం కలిగిన కార్మికులు అనేక మంది ఉన్నా వారికి తగిన జీతాలు అందించడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచల నరసయ్య, నాయకులు కొండా ప్రసాద్, మాలకొండయ్య, బాలు, సుజాతమ్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

నెల్లూరు(విద్య), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కొండాయపాళెంలో ఉన్న జీసెస్ సెంటర్‌లో అడల్ట్ లిట్రసీ టీచర్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా శుక్రవారం ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, విద్యా ద్వారా అసాంఘిక శక్తుల నిర్మూలన, ఆర్థికాభివృద్ధి తదితర అంశాలపై తరగతులు నిర్వహించారు. పీ ఆంథోని థాస్, జాన్సన్, రిబేకా, డాక్టర్ జార్జివిల్సన్, డాక్టర్ శ్రీనివాస్, ఉషారాణి రీసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు.

తుప్పు పడుతున్నా.. పట్టించుకోరా?

● నత్తనడకన పెన్నా బ్రిడ్జి, రోడ్డు పనులు ● కమ్ములు కట్టి వదిలేసిన వైనం

నెల్లూరు(వెంకటేశ్వరపురం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పెన్నా నదిపై నూతనంగా నిర్మిస్తున్న వంతెనతోపాటు ఇనమడుగు నుంచి నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఈ బ్రిడ్జి కమ్ రోడ్డు పనులు దాదాపు రెండేళ్ల నుంచి జరుగుతున్నాయి. అయినా ఇంతవరకు ఓ కొలిక్కిరాలేదు. ఈ పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం, కాంట్రాక్టర్ సైతం నిర్లక్ష్యంగా వ్యవహరి స్తుండటంతో పనుల్లో పురోగతి ఉండటం లేదు. రోడ్డు విస్తరణలో భాగంగా పడుగుపాడు, శెట్టిగుంటరోడ్డు ప్రాంతాల్లో పంట కాలువలపై నిర్మించాల్సిన బ్రిడ్జీలను సైతం కమ్ములతో సగం నిర్మించి వదిలేశారు. అలా వదిలేసి నెలలు గడుస్తుండటంతో ఇనుము తుప్పుపట్టి బలహీనమవుతోంది. రోడ్డు విస్తరణకు సంబంధించి వెంకటేశ్వరపురం కూడలి ప్రాంతంలో నిర్వాసితులకు పరిహారం సక్రమంగా ఇవ్వకపోవడంతో దుకాణదారులు న్యాయస్థానం తలుపుతట్టారు. దీంతో కొన్ని నెలలుగా పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిపెట్టి వంతెన, రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



పడుగుపాడు వద్ద అసంపూర్తిగా వదిలేసిన వంతెన



పాత చెక్‌పోస్టు వద్ద జాఫర్ సాహెబ్ కాలువపై..

In the Court of the Principal Senior Civil Judge::Nellore
E.P.No.111/2022
O.S.No.187/2014
Immadisetty Venkata Lakshmi ... Decree Holder
Vs
Renangi Padma ... Judgment Debtor
Notice to J.D.R
Renangi Padma
W/o. Venu, residing at D.No.25/6/190, Vengalarao Nagar, A.K.Nagar Post, Nellore Town, SPSR Nellore District.
పై నెంబరున డిక్రీ హోల్డర్ ఆస్తి కాబడిన జె.డి.ఆర్ తాలూకు స్థిరాస్తిని వేలంకు కోరినందున, సదరు ఇపిలో మీకు ఆర్డర్ 21 రూల్ 66 (సేల్ నోటీసు) నోటీసు నిమిత్తం తే.18-06-2025దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
వేమన గోపి, బి.కాం., యల్.యల్.బి., డిక్రీహోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.



తెప్పపై చాముండేశ్వరి వైభోగం

ఇందుకూరుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగపట్నంలో చాముండేశ్వరిదేవి అమ్మవారు శుక్రవారం రాత్రి తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఇక్కడ జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు శుక్రవారం తెప్పోత్సవానికి తిలకించేందుకు భక్తజనం పోటెత్తింది. ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ సభ్యులు గుండాల కృష్ణారెడ్డి, కొండూరు వెంకటరమణారెడ్డి, కేతిరెడ్డి అవినాష్‌రెడ్డి, బొడ్డుకూరు సుధీర్, భక్తులు పాల్గొన్నారు.

నమ్మకంగా ఉంటూనే టోకరా!

- హైవేపై గుర్తుతెలియని కారు ఢిల్లీ వ్యాపారిది
- అందులో రూ.కోట్ల కరెన్సీ రవాణా
- ముమ్మరంగా విచారిస్తున్న పోలీస్ యంత్రాంగం
- అదుపులో నలుగురు.. కరెన్సీ స్వాధీనం?

మర్రిపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడూ నిర్మానుష్యంగా ఉండే మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌లోకి పదుల సంఖ్యలో కార్లు వచ్చి ఆగాయి. ఎస్‌ఐ నుంచి డీఎస్పీ స్థాయి అధికారులు హడావుడిగా కనిపించారు. అలాగే మరికొందరు వ్యాపారులు కూడా అక్కడకు చేరుకున్నారు. ఈ హడావుడి ఏమిటని లోతుగా పరిశీలిస్తే అసలు విషయం వెలుగు చూసింది. మండల పరిధిలోని బాట, సింగనపల్లి సమీపంలో ముంబయి జాతీయరహదారిపై గురువారం పోలీసులు ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. అది మధ్యప్రదేశ్ రాష్ట్రంలో రిజిస్టర్ అయి ఉండటంతో దర్యాప్తును మరింత ముమ్మరం చేశారు. గుజరాత్‌కు చెందిన ఓ బడా వ్యాపారి తన వ్యాపారం నిమిత్తం అవసరమైన నగదును చెన్నైకి చేర్చాలని తనకు నమ్మకస్తులైన గుమాస్తాలకు తెలిపారు. నగదును ఢిల్లీ నుంచి బుధవారం హైదరాబాద్‌కు పంపి అక్కడ నుంచి చెన్నైకి చేర్చాలని సూచించాడు. కరెన్సీ రవాణా చేసేందుకు ఓ కారును సమకూర్చాడు. ఇందులో నగదు ఉంచేందుకు వీలుగా సీటు కింద ప్రత్యేకంగా ఇనుప ట్రేలతో లాకర్లు అమర్చి, అందులో కరెన్సీ కట్టలు ఉంచి రవాణా చేశారు. కర్నూలు, నెల్లూరు మీదుగా చెన్నై వెళ్లేందుకు బుధవారం రాత్రి హైదరాబాదులో వారు బయలుదేరారు. గురువారం ఉదయం నెల్లూరు-కడప సరిహద్దు ప్రాంతానికి చేరుకున్నారు. ఆ తర్వాతకు కారుకు అమర్చిన జీపీఎస్‌ను తొలగించారు. బాట, సింగణపల్లి సమీపంలో కారులో ఉన్న ఆ నగదును మరో కారులోకి మార్చి ఉడాయించి వెళ్లారు. డోర్లు తెరచి, సీటులు తొలగించి ఉన్న కారును గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మధ్యప్రదేశ్ చెందిన కారుగా (ఎంపీ07జడ్‌జె1078) పోలీసులు గుర్తించి, వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, ముమ్మరంగా వివరాలను ఆరాతీశారు. ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలు ఈ కేసును విచారిస్తున్నారు. మరోవైపు ఢిల్లీకి చెందిన వ్యాపారి గురువారం మర్రిపాడు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. భారీగా కార్లు చేరుకోవడంతో స్టేషన్ పరిసర ప్రాంతమంతా హడావుడిగా కనిపించింది. దొంగతనానికి పాల్పడిన నలుగురినికి పోలీసులు పట్టుకొని విచారిస్తున్నట్లు సమాచారం. అలాగే, ఓ వాహనంతోపాటు రూ.కోట్లు విలువైన నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.



మర్రిపాడు పోలీస్ స్టేషన్ వద్ద భారీగా ఆగి ఉన్న కార్లు

కు.ని.కి మగవారు దూరం !



కుటుంబ నియంత్రణ అనేది భార్యాభర్తల ఇద్దరి బాధ్యత. అయితే జిల్లాలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు స్త్రీలకే జరుగుతున్నాయి. ఈ విషయంలో పురుషులు ముందుకు రావడం లేదు. గడిచిన ఐదేళ్ల గణాంకాలను పరిశీలిస్తే కు.ని. శస్త్రచికిత్స (వేసక్టమి) చేయించుకున్న మగ మహారాజుల సంఖ్య నామమాత్రం!. ఒకవైపు అధిక శాతం కాన్పులు సిజేరియన్ ఆపరేషన్లతోనే జరుగుతుండగా మరోవైపు కు.ని. శస్త్రచికిత్సలు కూడా ఆడవారే చేయించుకోవాల్సి వస్తుండటంతో వారిపై ఒత్తిడి పెరుగుతోంది.

- వేసక్టమి చేయించుకోని పురుషులు
- మగతనం తగ్గుతుందనే అనుమానం
- లక్ష్యం వెయ్యి... జరిగేది 10!
- ప్రచారంలో వైద్య శాఖ వైఫల్యం
- అపోహ వీడాలంటున్న వైద్యులు

నెల్లూరు (వైద్యం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో వేసక్టమి శస్త్రచికిత్సలు చేయించుకునే వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. పురుషులు ఈ శస్త్రచికిత్సలకు ససేమిరా అంటున్నారు. కుటుంబ నియంత్రణ చేయించుకుంటే మగతనం తగ్గుతుందన్న అపోహ చాలా మంది మగవారిలో ఉండటమే దీనికి ప్రధాన కారణం. ప్రస్తుతం ఎన్నో నూతన పద్ధతులు అందుబాటులో ఉన్నప్పటికీ మగవారు మాత్రం ఆసక్తి చూపడం లేదు. మరోవైపు కుటుంబ నియంత్రణ అంటే అది కేవలం మహిళలకు మాత్రమే అన్న భావన అన్ని వర్గాల్లో పాతుకుపోయింది. దీనివల్ల వేసక్టమి శస్త్రచికిత్సలు బాగా తగ్గిపోయాయి. వైద్య ఆరోగ్యశాఖ ప్రతీ ఏడాది వెయ్యి వేసక్టమి ఆపరేషన్లు చేయాలని లక్ష్యాన్ని నిర్దేశిస్తుండగా కేవలం 10 నుంచి 12లోపు జరుగుతున్నాయి. కొన్ని సంవత్సరాలైతే అవి కూడా జరగలేదని గణాంకాలు చెబుతున్నాయి.

గత ఐదేళ్లలో జిల్లాలో వేసక్టమి శస్త్ర చికిత్సలు

సంవత్సరం	వేసక్టమి
2020 - 21	0
2021 - 22	0
2022 - 23	10
2023 - 24	11
2024 - 25	4
2025 - 26	0



1952 నుంచే...

దేశంలో జనాభా నియంత్రణ లేకపోవటం వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ఆ ప్రభావం ప్రభుత్వాలపై కూడా పడుతోందని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 1952వ సంవత్సరంలోనే జనాభా నియంత్రణకు శ్రీకారం చుట్టింది. ఏటా లక్ష్యాలు నిర్దేశించి కుటుంబ నియంత్రణకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోంది. అయితే గత ఐదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కు.ని లక్ష్యాలపై పెద్దగా దృష్టి సారించక పోవటంతో అనుకున్న ఫలితాలు రావడం లేదు. ఏటా జిల్లాలో 15వేల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయాలని కేంద్ర కుటుంబ సంక్షేమశాఖ లక్ష్యాన్ని నిర్ణయించగా ఇందులో 50 శాతం కూడా పూర్తికావడం లేదు. ఈ నేపథ్యంలో మగవారు అపోహలు వీడి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

జనాభాకు అనుగుణంగా లక్ష్యాలేవి?

జిల్లాలో ప్రస్తుతం 26.50 లక్షల మంది జనాభా ఉన్నారు. ఏటా ఈ సంఖ్య పెరుగుతూనే ఉంది. మరోవైపు ప్రతీ సంవత్సరం జిల్లాలో సుమారు 43వేల ప్రసవాలు జరుగుతున్నాయి. అయితే ఇద్దరు పిల్లలు పుట్టగానే కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకోవాలని ప్రజల్లో తగిన అవగాహన ఉన్నప్పటికీ ఎక్కువగా ఆడవారే ట్యూబెక్టమి ఆపరేషన్లు చేయించుకుంటున్నారుగానీ మగవారు మాత్రం వేసక్టమి ఆపరేషన్లు చేయించుకోవటం లేదు. ఈ పరిస్థితికి యంత్రాంగం వైఫల్యం కూడా కారణం. వేసక్టమిపై అపోహలు, అనుమానాలు నివృత్తి చేయటానికి తగిన ప్రచారం చేయడంలో వెనుకబడటంతో వేసక్టమి లక్ష్యాలు నెరవేరడం లేదు.

ముందుకు రావడం లేదు



వేసక్టమికి మగవారు ముందుకు రావడం లేదు. మగతనం తగ్గుతుం దని, కొన్ని రోజులు ఇంట్లోనే ఉండాల్సి వస్తుందన్న అపోహలు ఉన్నాయి. ఈ శస్త్రచికిత్సపై తగిన ప్రచారం అవసరం. గ్రామస్థాయిలో ఈ చికిత్సలు జరిగేలా చర్యలు తీసుకోవాలి. అపోహలు తొలగించేందుకు కృషి చేస్తున్నాం.

\- డాక్టర్ వెంకటేశ్వర్లు, వేసక్టమి శస్త్రచికిత్స నిపుణులు, జీజీహెచ్

మాలకొండ హుండీల ఆదాయం రూ.1,14,73,106

వలేటివారిపాలెం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి 37 హుండీల్లో 11 శనివారాల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.1,14,73,106 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్ర శేఖర్ తెలిపారు. మాలకొండలోని కల్యాణ మండపంలో శుక్రవారం కందుకూరు గ్రూపు దేవాలయాల ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది. నగదుతో పాటు 308 గ్రాముల బంగారం, 2415 గ్రాముల వెండి, 251 అమెరికన్ డాలర్లు, 20 సింగపూర్ డాలర్లు, 2 మలేషియా రింగిట్స్, 20 ఇంగ్లండ్ పౌండ్స్, 10,000 వియత్నాం డాంగ్, 100 సౌత్‌ఆఫ్రికన్ డాంగ్ లభించినట్లు డీసీ చంద్రశేఖర్ తెలిపారు.



మాలకొండలో హుండీల్లో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

రాష్ట్ర ప్రతిభా అవార్డులకు 'కేపీసీ' విద్యార్థులు

నెల్లూరు(విద్య), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని కేపీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర ప్రతిభా పురస్కారాలకు ఎంపిక య్యారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. కళాశాలలో శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కంప్యూటర్ సైన్స్ విద్యార్థి షేక్ అక్బర్ ఇంటర్లో 1000కి 978 మార్కులు, హెచ్‌ఈసీ విద్యార్థిని యోషిక 946 మార్కులు సాధించి రాష్ట్ర ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు చెప్పారు. మిగిలిన విద్యార్థులకు కూడా రానున్న రోజుల్లో ఉత్తమ విద్యనందించి వారి ఉన్నతికి తోడ్పడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం 95 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 38.655 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నా డెల్టాకు 3,850, ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ప్యాకేజీ-1పై విజిలెన్స్

- విచారణకు ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వం
- రికార్డులన్నీ ఇవ్వాలంటూ విజిలెన్స్ అధికారుల లేఖ
- కదిలించిన 'ఆంధ్రజ్యోతి' కథనాలు
- అవినీతి అధికారుల్లో మొదలైన వణుకు

నెల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : పెన్నా డెల్టా సిస్టమ్‌ను ఆధునికీకరించేందుకు 2008-09లో రూ.308 కోట్ల అంచనాలతో ప్యాకేజీ-1 పేరుతో టెండర్లు పిలిచారు. మోడరనైజేషన్ చేయడమే కాకుండా 124 డిస్ట్రిబ్యూటరీ కాలువలకు సీసీ లైనింగ్ ఏర్పాటు చేయాలన్నది ఉద్దేశం. ఈ వర్కును అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత ఓ వైసీపీ కీలక నేత 4.95 శాతం ఎక్సెస్‌కు దక్కించుకున్నారు. అయితే ఈ వర్కు నిబంధనల ప్రకారం పనులు జరగలేదని, కాలువల లైనింగ్ వెడల్పులను తగ్గించి పనులు చేశారని గతంలోనే అధికారులకు ఫిర్యాదులు అందాయి. అయినా ఎవరూ పట్టించుకోలేదు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్యాకేజీ-1 వర్కును ప్రీక్లోజ్ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. 2020, జూలైలో ప్రీక్లోజ్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ప్రీక్లోజ్‌లో భాగంగా అప్పటి వరకూ కాంట్రాక్టర్ చేసిన పనులన్నింటికీ ఎంబుక్ రికార్డింగ్ చేసి, వాటికి చెక్ మెజర్మెంట్ చేశారు. ఫైనల్ బిల్లు మొత్తం రూ.67 కోట్లు చెల్లించాలని తేల్చారు. ఈ మేరకు చేసిన పనులను పరిశీలించి క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ జారీ చేయాలని నెల్లూరు సెంట్రల్ డివిజన్ ఈఈ నుంచి 2021 ఫిబ్రవరిలో క్వాలిటీ కంట్రోల్ ఈఈకు లేఖ వెళ్లింది. ఈ రిక్విజిషన్ ప్రకారం మొదట క్యూసీ అధికారులు సర్టిఫికెట్లు జారీ చేశారు. ఇందులో ఒక సర్టిఫికెట్లో దిద్దుబాటు చేసి రూ.4.12 కోట్లను అదనంగా చేర్చారు. ఇదే పేరుతో మరో రూ.4.40 కోట్లతో మరో సర్టిఫికెట్‌ను జారీ చేశారు. ఇక ప్రభుత్వం ప్రీక్లోజ్ చేశాక సీఈ అంచనాలు రివైజ్ చేయడం కూడా మరో వివాదంగా ఉంది. ఇక ఇందులో బ్యాంక్ కమీషన్ చార్జీలకు రూ.50 లక్షలకు అనుమతి ఇవ్వగా బిల్లులో మాత్రం దాదాపు రూ.2 కోట్లకుపైగా పెట్టినట్లు ఫిర్యాదులున్నాయి. ఇలా ఒక లెక్కా పక్కా లేకుండా ఇష్టమొచ్చినట్లు ప్యాకేజీ-1 ప్రీక్లోజ్ ప్రక్రియ జరిగింది.



మార్చి 29న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

కదిలించిన 'ఆంధ్రజ్యోతి'

ప్యాకేజీ-1లో జరిగిన అవకతవకలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో వరుస కథనాలు ప్రచురించింది. 'దోచిపెట్టడానికే దిద్దారా..?', 'ప్యాకేజీ-1లో ఎన్నెన్నో సిత్రాలు..!', 'అంతా గప్‌చుప్', 'ప్యాకేజీ-1 ఫైళ్లు మాయం!' శీర్షికలతో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఇరిగేషన్ అధికారులు చేసిన జిమ్మిక్కులను, అనుమానాలను ఈ కథనాలు బట్టబయలు చేశాయి. ఈ కథనాలపై స్పందించిన కలెక్టర్ ఓ ఆనంద్.. ప్యాకేజీ-1 వర్కుపై నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ ఎస్‌ఈ దేశానాయక్‌ను ఆదేశించారు. ఈ క్రమంలో ఆరోపణలపై వివరణ ఇవ్వాలంటూ సెంట్రల్ డివిజన్ ఈఈకు ఎస్‌ఈ మెమో జారీ చేశారు. అయినా సమాధానం రాకపోవడంతో మరోసారి మెమో ఇచ్చారు. ఆ తర్వాత పూర్తిస్థాయి విచారణకు డిప్యూటీ ఎస్‌ఈను నియమించారు. అయినా విచారణ పూర్తికాలేదు. కలెక్టర్‌కు నివేదిక అందలేదు. దీనిని బట్టే ఇరిగేషన్ శాఖలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ప్రభుత్వం ప్యాకేజీ-1 వ్యవహారాన్ని విజిలెన్స్‌కు అప్పగించింది. 17వ తేదీ లోపు అడ్మినిస్ట్రేటివ్ అనుమతులు, టెక్నికల్ అనుమతులు, అగ్రిమెంటు కాపీలు, టెండర్ డాక్యుమెంట్లు, ఎంబుక్‌లు, క్యూసీ రిపోర్టులు, బిల్లుల వారీగా పేమెంట్ వివరాలు, ప్రీక్లోజర్ ప్రతిపాదనలు, ప్రీక్లోజర్ అగ్రిమెంట్లతో పాటు ఇందుకు సంబంధించిన పర్యవేక్షించిన అధికారుల జాబితాను కూడా ఇవ్వాలంటూ విజిలెన్స్ అధికారులు కోరారు. ఈ వివరాలు అందగానే విజిలెన్స్ అధికారులు విచారణ మొదలుకానుంది. ఈ వ్యవహారం ఇప్పుడు ఇరిగేషన్ శాఖలో కలకలాన్ని రేపుతుండగా, సంబంధిత అధికారుల్లో మాత్రం వణుకు మొదలైంది.

మట్టి అక్రమ రవాణాపై మైనింగ్ అధికారుల విచారణ

తోటపల్లిగూడూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు పంచాయతీ మహాలక్ష్మీపురం గ్రామంలో మట్టి అక్రమ రవాణాపై శుక్రవారం మైనింగ్ శాఖకు చెందిన టెక్నికల్ అసిస్టెంట్ ఆర్ వెంకటేశ్వర్లు, సర్వే సూపర్‌వైజర్ ఎం సుధాకర్ విచారణ చేపట్టారు. మట్టి తోలకాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి అక్రమంగా మట్టి తోలిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్ ఎస్‌కె మహబూబ్‌బాషా, ఆర్‌ఐ సి యశ్వంత్, వీఆర్‌వో రవిదర్శిని, కోడూరు సచివాలయ సర్వేయర్ బి నరేష్, తదితరులు పాల్గొన్నారు.



మట్టి అక్రమ రవాణా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు


డీఎల్‌డీవో వ్యవస్థ బలోపేతం

- కీలక అధికారాలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

నెల్లూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణాభివృద్ధిలో కీలకమైన పంచాయతీ రాజ్ విభాగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ అభివృద్ధి పర్యవేక్షణలో మండల స్థాయి తర్వాత జిల్లా స్థాయిలోనే ఉండేది. రెవెన్యూ వ్యవస్థ మాదిరిగా డివిజనల్ వ్యవస్థ పంచాయతీ రాజ్‌లో ఉండేది కాదు. ఇకపై డివిజనల్ స్థాయిలో కూడా అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ఒక ప్రత్యేక వ్యవస్థకు రూపొందిస్తూ, ఇప్పటికే ఉన్న డీఎల్‌డీవోలకు మరిన్ని అధికారాలు కట్టబెట్టింది. గత ప్రభుత్వంలో డీఎల్‌డీవో (డివిజనల్ స్థాయి అభివృద్ధి అధికారి) పోస్టులను ఏర్పాటు చేశారు. నాడు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఎంపీడీవోల ప్రొమోషన్స్ కోసం ఈ పోస్టులను సృష్టించారు తప్ప ఆ అధికారుల చేత పని చేయించుకుందామన్న ఉద్దేశం కనిపించలేదు. ఈ డీఎల్‌డీవోలకు కనీసం ఒక కార్యాలయం కూడా లేదు. ఎంపీడీవో కార్యాలయాల్లోనే ఏదో ఒక మూల ఒక గదిని కేటాయించారు. విధులు కూడా కేటాయించకపోవడంతో ఆ పోస్టులు అన్నవి నామమాత్రంగా మారిపోయాయి. అయితే వీరంతా సీనియర్ ఎంపీడీవోలుగా ఉండి ఉద్యోగోన్నతి పొందిన వారు కావడంతో, వారి అనుభవాన్ని ఉపయోగించుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రెవెన్యూలో ఆర్డీవో మాదిరిగా రూరల్ డెవలప్‌మెంట్‌లో డీఎల్‌డీవో ఉండే విధంగా జాబ్‌చార్ట్‌ను సవరించింది. జిల్లాలో నెల్లూరు, కావలి, ఆత్మకూరు, కందుకూరు డీఎల్‌డీవోలు ఉన్నారు. ఈ నాలుగు ప్రాంతాల్లోనూ డీఎల్‌డీవో కార్యాలయాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం నెల్లూరు డీఎల్‌డీవో ఆఫీసు ఎంపీడీవో కార్యాలయం మిద్దెపై ఒక రూములో కొనసాగుతోంది. ఇకపై దానిని ఆర్టీసీ బస్టాండ్ పక్కనున్న మీసేవా భవనంలోకి మార్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకూ ఇద్దరు మాత్రమే డీఎల్‌డీవోలకు సహాయకులుగా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఇకపై వీరి కార్యాలయంలో రెగ్యులర్ ప్రాతిపదికన 15 మంది వరకూ పనిచేసేలా జాబ్‌చార్ట్ తయారు చేశారు. వీరి కిందకు ఎంపీడీవోలు, డివిజనల్ పంచాయతీ అధికారులు, డ్వామా ఏపీడీలను తీసుకురానున్నారు. మండల పరిషత్‌లలో జరిగే అభివృద్ధి పనులను పర్యవేక్షించడంతో పాటు ఉపాధి హామీ పథకం కింద జరిగే పనులను కూడా పర్యవేక్షించే బాధ్యతలను డీఎల్‌డీవోలకు అప్పగించారు. మొత్తంగా డివిజన్ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే శాఖలన్నింటినీ ఒక గొడుగు కిందకు తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీని ద్వారా అభివృద్ధిని వేగవంతం చేయవచ్చునన్నది ప్రభుత్వ లక్ష్యం. అలానే ఇప్పటి వరకూ స్థానిక సంస్థల ఎన్నికలకు డిప్యూటీ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటీలుగా ఆర్డీవోలు వ్యవహరిస్తుండగా, ఇకపై ఆ విధులను డీఎల్‌డీవోలకు అప్పగించనున్నారు. రెవెన్యూలో మాదిరిగా పంచాయతీరాజ్‌లో కూడా డివిజన్ స్థాయిలో ఒక సమాంతర వ్యవస్థ ఏర్పాటవుతుండడం శుభపరిణామమని పంచాయతీరాజ్ వర్గాలు చెబుతున్నాయి.

కోటేశ్వరస్వామికి పురుషామృగ వాహన సేవ


సంగం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో ఉన్న గంగా పార్వతీ సమేత కోటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి పార్వతీ, కోటేశ్వరస్వామి పురుషామృగ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పార్వతీదేవి, కోటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను పురుషామృగ వాహనంపై ఉంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారి చదలవాడ శివకుమార్ చార్యులు తీర్థప్రసాదాలు అందచేశారు.



వైద్య ఆరోగ్య శాఖలో ఉగ్యోగుల బదిలీలు

- 19న ముగియనున్న ప్రక్రియ

నెల్లూరు (వైద్యం) జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలు పర్వం కొనసాగుతోంది. డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో ఈ ఉద్యోగుల బదిలీలు జరుగుతున్నాయి. అయితే ఐదేళ్లు ఒకేచోట ఉన్నవారు తప్పనిసరిగా బదిలీ కావాలసి ఉండటంతో ఉద్యోగులు తాము పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు దగ్గరలోని పీహెచ్‌సీలకు మారేందుకు వైద్యాధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నేతల సిపారసు లేఖలు కూడా తమ దరఖాస్తులో పొందుపరుస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే శుక్రవారం జరిగిన బదిలీల కౌన్సెలింగ్‌లో ఉద్యోగ్యుల పెద్ద ఎత్తున జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు తరలివచ్చారు. దీంతో డీఎంహెచ్‌వో కార్యాలయం సందడిగా మారింది. రెండు రోజుల వరకు 19 మంది అటెండర్లు, 9 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లకు కౌన్సెలింగ్ జరిగింది. ఆది, సోమవారాలలో 101 మంది ఏఎన్‌ఎంలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుంది. 19న ఈ ప్రక్రియ ముగుస్తుంది.



ఉద్యోగుల కౌన్సెలింగ్ జరుపుతున్న డీఎంహెచ్‌వో సుజాత

20న ఉదయగిరి మండల సర్వసభ్య సమావేశం

ఉదయగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో ఈనెల 20వ తేదీన ఉదయగిరి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అప్పాజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మూలె పద్మజ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9574
వెండి కిలో ధర	రూ. 109200
వెండి ఒక గ్రాము	రూ. 112.20

మందుబాబులకు అడ్డాగా ప్రభుత్వ కార్యాలయ ఆవరణలు

● పగలు కార్యాలయాలు.. రాత్రి మినీ బార్లు ● సిబ్బంది అవస్థలు



వ్యవసాయ కార్యాలయ సమీపంలో పడేసిన ఖాళీ మద్యం సీసాలు

ఉదయగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు మందుబాబులకు అడ్డాగా మారాయి. పగలంతా అధికారులు, కార్యాలయాలకు వచ్చే కార్యార్థులతో రద్దీగా ఉండే కార్యాలయాల ఆవరణలు రాత్రయితే మందుబాబులకు నెలవుగా మారుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న వ్యవసాయ, ఎంఈవో, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, భవిత కేంద్రం, హౌసింగ్, కొట్టాలపల్లి సొసైటీ, వెలుగు, ఉపాధి హామీ కార్యాలయాల ఆవరణలు చీకటి పడితే చాలు మందుబాబుల సిట్టింగ్‌లతో మినీ బార్లను తలపిస్తున్నాయి. రాత్రయితే ఆప్రాంతంలో జన సంచారం లేకపోవడం, విద్యుత్ దీపాలు కూడా సక్రమంగా లేకపోవడంతో చీకటి కార్యకలాపాలకు నిలయంగా మారినా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు విమర్శిస్తున్నారు.

సిబ్బంది అవస్థలు

కార్యాలయాల ఆవరణలో ఎక్కడ చూసినా ఖాళీ మద్యం సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. అలాగే మందుబాబులు కార్యాలయం ద్వారం వద్ద మద్యం సేవించి వ్యర్థాలను అక్కడే వదిలేస్తుండడంతో ఉదయం విధులకు వచ్చిన సిబ్బంది వాటిని తొలగించాల్సిన దుస్థితి నెలకొంది. కొంతమంది మద్యం సేవించిన అనంతరం వాటిని పగులగొడుతుండడంతో అటువైపు వచ్చే పాదచారులు గాజుపెంకులు గుచ్చుకుని ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయాల ఆవరణలో మద్యం సేవిస్తున్న మందుబాబులపై ప్రత్యేక నిఘా ఉంచి నివారించాలని పలువురు కోరుతున్నారు.



నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు

● హేమంత్‌కుమార్, తహసీల్దారు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మండలంలో రియల్ ఎస్టేట్ పేరుతో అక్రమ లేఅవుట్లు వేసి అమ్మకాలు సాగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ హేమంత్ కుమార్ హెచ్చరించారు.

? లేఅవుట్లపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు.

! ప్రభుత్వం నిర్దేశించిన మేరకే లేఅవుట్లు వేయాలి. తప్పనిసరిగా ల్యాండ్ కన్వర్షన్ చేయించుకున్న తర్వాతే పనులు చేపట్టాలి. త్వరలోనే పరిశీలన చేసి నిబంధనలు లేని వాటిపై ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తాం.

? వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ అందిస్తున్నారా.

! ఇప్పటికే డీలర్లకు ఆదేశాలు అందించాం. కొంతమంది నిర్లక్ష్యంగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చింది. వృద్ధులు, దివ్యాంగులకు నేరుగా ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు అందేలా చర్యలు చేపడతాం. ఇప్పటివరకు 70 శాతం పంపిణీ పూర్తిచేశాం.

? రెండో విడత రీసర్వే ఎలా నిర్వహిస్తున్నారు.

! రైతులకు ముందస్తుగా సమాచారం అందించి సమగ్రంగా రికార్డులను ఆధారం చేసుకొని రీసర్వే చేపడుతున్నాం. తొలుత భాస్కరాపురం రెవెన్యూలో పూర్తిచేశాం. ప్రస్తుతం గణేశ్వరాపురంలో నిర్వహించడం జరుగుతుంది. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

నెల్లూరు(సిటీ), జూన్13 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఆ మేరకు ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరుతూ కార్మిక సంఘం నాయకులు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఎమ్మెల్యేను శు క్రవారం ఆయన కార్యాలయంలో కలిశారు. కార్మికులకు ఉద్యోగ విరమ ణ వయో పరిమితిని 62 ఏళ్లకు పెంచాలని, ఉద్యోగ విర మణ ప్రయోజనాలను కల్పించాలని కోరారు. నైపుణ్యం కలిగిన కార్మికులు అనేక మంది ఉన్నా వారికి తగిన జీతాలు అందించడం లేదని ఆరోపించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

నెల్లూరు(విద్య), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నగరం లోని కొండాయపాళెంలో ఉన్న జీసెస్ సెంటర్‌లో అడ ల్ట్ లిట్రసీ టీచర్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా శుక్రవారం ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు, విద్యా ద్వారా అసాంఘిక శక్తుల నిర్మూలన, ఆర్థికాభివృద్ధి తదితర అంశాలపై తరగతులు నిర్వహించారు. పీ ఆంథోని థాస్, జాన్సన్, రిబేకా, డాక్టర్ జార్జివిల్సన్, డాక్టర్ శ్రీని వాస్, ఉషారాణి రీసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు.

వైభవంగా ఆత్మారాముడి చంద్రప్రభ సేవ

సంగం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెంలో ఉన్న ఆత్మారామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అర్ధరాత్రి స్వామివారికి చంద్రప్రభ సేవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సీతాదేవి, ఆత్మారాముడి ఉత్సవ విగ్రహాన్ని చంద్రప్రభపై ఉంచి మంగళ వాయిద్యాలు నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

నేటి నుంచి గంగాభవాని అమ్మవారి ఉత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం

ఉదయగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిరెడ్డిపల్లిలో ఉన్న అనంతపూరి గంగా భవాని అమ్మవారి ఉత్సవాలు శనివారం నుంచి మంగళవారం వరకు నిర్వ హించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం సీతారాముల కల్యాణోత్సవం, గ్రామోత్సవం, ఆదివారం వసంతోత్సవం, రాత్రికి గంగాభవాని అమ్మవారి నిలుపు, గ్రామోత్సవం, సోమవారం గంగాభవాని అమ్మవారికి కుంకుమ పూజ, గ్రామోత్సవం, మంగళవారం గ్రామోత్సవం, బండ్లపొంగళ్లు, ఎడ్ల బండలాగుడు పోటీలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు భక్తుల సౌకర్యార్థం అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్

ఆత్మకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్ తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానికులు యోగాసనాలు వేశారు. యోగాపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకతీతంగా అందరినీ కలిపే శక్తి యోగాకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ దుర్గాప్రసాద్, మున్సిపల్, మెప్మా, వార్డు సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లక్కరాజుపల్లి చెరువు అభివృద్ధిపై దృష్టి : డీఈ

అనంతసాగరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినగల్లు పంచాయతీ లక్కరాజుపల్లి చెరువు అభివృద్ధిపై ప్రతేక దృష్టి సారించినట్లు ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆగ్రామ నీటిసంఘం అధ్యక్షుడు కమ్మ రమణయ్యనాయుడు ఆధ్వర్యంలో గ్రామంలో రైతులతో సమా వేశం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలువల్లో పూడికతీత పనులు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈలు లీలాకుమారి, ఖాదర్ పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల బదిలీలు

ఉదయగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల్లో విధులు నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఉదయగిరి మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ పల్నాడు జిల్లా నూజండ్లకు, వరికుంటపాడు ఏవో రవికుమార్ ప్రకాశం జిల్లా హనుమంతునిపాడుకు, మర్రిపాడు ఏవో రామ్మోహన్ నెల్లూరు డీఆర్సీకి, దుత్తలూరు ఏవో సుబ్బారెడ్డి ఉదయగిరి టెక్నికల్ ఏవోగా నియమించబడ్డారు.

విద్యార్థి మిత్ర కిట్లు అందజేత



విద్యార్థి కిట్లు అందచేసిన ఉపాధ్యాయులు.

కలువాయి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలుగురాయపురం ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు అందజేశారు. బ్యాగు, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు తదితర వస్తువులతో కూడిన కిట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం జీవీ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు ఆర్‌వీ కృష్ణారెడ్డి, డి వినోద్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

అనంతసాగరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ మండల అధ్యక్షుడు అన్వర్‌బాషా డిమాండ్ చేశారు. శుక్రవారం సిబ్బందితో కలిసి తహసీల్దారు జయవర్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. తమకు ప్రభుత్వ పథకాలు వర్తించేలా చూడాలని వారు కోరారు.

ఆత్మకూరు ఎంపీడీవోగా రఫీఖాన్ నియామకం

ఆత్మకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా ఆత్మకూరు నూతన ఎంపీడీవోగా పి రఫీఖాన్ నియమితులయ్యారు. ఆయన కాళహస్తిలో పని చేస్తూ ఆత్మకూరుకు బదిలీ అయ్యారు. ఆత్మకూరు ఎంపీడీవోగా పనిచేస్తున్న పి ఐజాక్‌ప్రవీణ్ అనంతసాగరంకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో రఫీఖాన్‌ను శుక్రవారం ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను సక్రమంగా అమ లు చేస్తామని, నిర్దేశిత లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేస్తామని తెలిపారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 719 బేళ్లను తీసుకొనిరాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 453 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 266 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ. 280 కాగా, కనిష్ఠ ధర రూ. 180 పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

సంగం వ్యవసాయ అధికారిగా శశిధర్

సంగం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారిగా శశిధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో సంగంలో పనిచేస్తున్న ఎం శ్రీహరి బుచ్చిరెడ్డిపాళెం మండలానికి బదిలీ అయ్యారు. దీంతో చేజర్లలో ఏవోగా పనిచేస్తున్న శశిధర్ సంగంకు బదిలీ అయ్యారు. ఈమేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ



మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

సీతారామపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మలేరియా నివారణ మాసోత్సవాలలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ంలో డాక్టర్ స్వప్న ఆధ్వర్యంలో శుక్రవారం మలేరియా నిర్మూ లనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తన సిబ్బందితో కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ స్వప్న మాట్లాడుతూ మలేరియా బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, శేఖర్ రాజు, తిరుపాల్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిఎస్‌లు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

5277 రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ



కలువాయిలో లబ్ధిదారుల చేత ఈకేవైసీ చేయిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది.

కలువాయి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన పథకం ద్వారా మండలంలోని 5277 రైతు కుటుంబాలకు సాయం అందనుంది. ఎంపిక చేసిన అర్హుల జాబితాలు రైతు సేవా కేంద్రాలకు చేరాయి. లబ్ధిదారులతో గ్రామ వ్యవసాయ సహాయకులు రెండు రోజులుగా ఈకేవైసీ చేయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం సూపర్-6 హామీల్లో భాగంగా ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ఏటా రూ. 20వేలు ఆర్థిక సాయం అందించనుంది. పీఎం కిసాన్ ద్వారా మూడు విడతల్లో రెండువేల చొప్పున లభించే రూ.6వేలకు తోడు రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు కలసి జమ చేయనుంది. తొలి రెండు విడతల్లో ఐదువేల రూపాయలు వంతున, మూడవసారి రూ.4వేలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. ఈనెల 20వ తేదీన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ యోజన పథకం ద్వారా తొలి విడత రూ.7వేల సాయం లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయి. ఇందుకు అవసరమైన ప్రక్రియ వేగంగా సాగుతోంది.

ఈకేవైసీ తప్పనిసరి

ఉదయగిరి : అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు వారి పరిధిలోని రైతుసేవా కేంద్రానికి వెళ్లి జాబితా పరిశీలించుకుని ఈకేవైసీ చేయించుకోవాలని ఇన్‌చార్జి ఏడీఏ పీ చెన్నారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు మండలాలకు చెందిన రైతులు జాబితాను పరిశీలించుకుని ఆధార్‌కార్డుతో రైతుసేవా కేంద్రానికి వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

దర్గాల అభివృద్ధికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అహ్మద్‌బాషాఖాలిది

ఉదయగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన దర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం జాతీయ విధానం రూపొందించి వాటి నిర్వహణకై ప్రత్యేక బోర్డును ఏర్పాటుచేయాలని ఆల్ ఇండియా సూఫీ సజ్జదానషీన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి అహ్మద్‌బాషాఖాలిది కోరారు. శుక్రవారం స్థానిక ఖాదరీయా ఆస్థానలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ దర్గాల అభివృద్ధిని ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, దీంతో దర్గాధిపతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రన్నారు. కావున ప్రభుత్వం దర్గాల అభివృద్ధికి ప్రత్యేక బోర్డు ఏర్పాటుచేసి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు దస్తగిరి అహ్మద్, జహరార్, షేక్ ఎండీ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మండలంలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దారు పద్మజాకుమారిని అభినందిస్తున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు పి పద్మజా కుమారిని శుక్రవారం పలువురు ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. మండలంలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కేతా విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, ప్రధాన కార్య దర్శి తోడేటి వెంకటయ్య, టీడీపీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, గొట్టిగుండాల బుజ్జిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, షేక్ మహబూబ్‌బాష, పొడమేకల పెంచలయ్య, దగుమాటి శివకోటారెడ్డి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతునికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

వింజమూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జనార్ధనపురం గ్రామానికి చెందిన నల్లపునేని నాగార్జున (28) శుక్రవారం మృతిచెందగా స్థానిక టీడీపీ నాయకులు నివాళులర్పించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చరవాణి ద్వారా కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, సీనియర్ నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి, చల్లా శ్రీనివాసులుయాదవ్, కొండపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన వాహనం

సంగం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుచ్చిరెడ్డిపాళెం టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం ఉదయం సంగం పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. చేజర్ల మండలం నాగులవెల్లటూరు నుంచి రేషన్ బియ్యాన్ని ఓ వాహనంలో బుచ్చిరెడ్డిపాళెంలోని ఓ రైస్ మిల్లుకు తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు బుచ్చి టోల్‌ప్లాజా వద్ద వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో సుమారు రెండున్నర టన్నుల రేషన్ బియ్యం ఉండడంతో వాహనాన్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈమేరకు సంగం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ రిపేరు విషయంలో గొడవ

● ఒకరిపై కత్తితో దాడి

నెల్లూరు(క్రైం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని మూలపేట రావిచెట్టు సెంటర్‌లో బైక్ మెకానిక్ షాపు వద్ద ఓ వ్యక్తి కత్తితో దాడి చేసి పరారయ్యాడు. పోలీసుల కథనం మేరకు... మూలాపేట రాజాగారి వీధికి చెందిన వెంకటేష్ బావ కృష్ణ రావిచెట్టు సెంటర్‌లో బైక్‌మెకానిక్ షాపు నిర్వహిస్తున్నారు. గురువారం సాయంత్రం వెంకటేష్ ఆ షాపు వద్దకు వెళ్లాడు. అదే సమయంలో ఇరగాళమ్మ సంఘానికి చెందిన వేణు అనే వ్యక్తి వచ్చి బైక్ రిపేరు చేయమని అడిగాడు. కావలసిన వస్తువులు తెచ్చుకుంటే రిపేరు చేస్తామని కృష్ణ చెప్పగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో అక్కడే ఉన్న వెంకటేష్, షాపులో పనిచేసే హరీష్ కలిసి సర్దిచెప్పారు. అనంతరం అక్కడ నుంచి వెళ్లిపోయిన వేణు, కొద్దిసేపటి తర్వాత మరో బైక్‌పై వచ్చి కత్తితో మెకానిక్ కృష్ణపై దాడి చేయబోయాడు. అడ్డుపోయిన వెంకటేష్ చేతికి గాయమైంది. చుట్టుప్రక్కల వారు రావడంతో వేణు అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడ్డ వెంకటేష్‌ను నగరంలోని రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించారు. బాధితుడు శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తాపడి మహిళ మృతి

● ఆరుగురికి గాయాలు



బోల్తాపడిన ఆటో

వెంకటాచలం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వేపల్లి సమీపంలో మల్లుగుంట సంఘం వద్ద శుక్రవారం ఉదయం ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో ఒక మహిళ అక్కడికక్కడే మృతిచెందగా ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇడిమేపల్లి పంచాయతీ పలుకూరివారిపాళెంకు చెందిన ఆటోడ్రైవర్ చల్లా హరిబాబు తన ఆటోలో నారేత వేసేందుకు ఆప్రాంతం నుంచి మహిళా కూలీలతో పొట్టెంపాడు గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో మల్లుగుంట సంఘం వద్దకు వచ్చేసరికి అక్కడ ఉన్న మలుపులో మోటార్‌బైక్ రావడంతో తప్పించబోయి ఆటో బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న పలుకూరివారిపాళెనికి చెందిన మల్లి లక్ష్మీదేవి (59) అక్కడికక్కడే మృతిచెందగా, చల్లా రమణమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు క్షతగాత్రులను సమీపంలోని సర్వేపల్లికి తీసుకెళ్లగా అక్కడినుంచి 108 వాహనంలో నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు సోమిరెడ్డి పరామర్శ



కాగా, రోడ్డు ప్రమాద బాధితులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరామర్శించారు. నెల్లూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వద్దకు వెళ్లి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య



మృతిచెందిన సవరం చిన్నలక్ష్మయ్య

సీతరామపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగనాయుడుపల్లి గ్రామ ఎస్టీ కాలనీకి చెందిన సవరం చిన్న లక్ష్మయ్య (35) శుక్రవారం ఆర్థిక సమస్యల కారణంగా మద్యంలో పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు... సవరం లక్ష్మయ్య తరచూ మద్యం సేవిస్తుండడంతో అప్పులు పెట్టుకుని తాగడం ఏమిటని కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. దీంతో చిన్న లక్ష్మయ్య అతిగా మద్యం సేవించి ఇంటి ముందు పడిపోవడంతో కుటుంబ సభ్యులు ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

పెన్నాలో గుర్తుతెలియని మృతదేహం



పెన్నానదిలో లభ్యమైన గుర్తుతెలియని మృతదేహం

నెల్లూరు(క్రైం), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని తిక్కన పార్క్ వద్ద పెన్నానదిలో గుర్తు తెలియని మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. రంగనాయకులపేట ఇసుకడొంక 52-1 సచివాలయం వార్డ్ రెవెన్యూ సెక్రెటరీ ఎస్‌కే సందాని బాషాకు సమాచారం అందించారు. ఆయన అక్కడికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంతపేట పోలీసులు మృతదేహాన్ని పరిశీలిం చారు. 35-40 సంవత్సరాల మధ్య వయస్కుడి మృతదేహం నీటిలో బోర్లా పడి ఉంది. మృతుడు ఎవరని తెలుసుకునే ఆధా రాలు లభించలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	119
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	238
కోడిగుడ్ల ధర (100):	535

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై తహసీల్దారు విచారణ

కొండాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కదామెర్ల పంచాయతీ పొట్టిపల్లి గ్రామంలో ప్రభుత్వ స్థలం ఆక్రమణపై తహసీల్దారు కోటేశ్వరరావు శుక్రవారం విచారణ చేపట్టారు. వివరాల మేరకు.. 1996లో గ్రామంలో అప్పటి అధికారులు లే అవుట్ వేసి ప్లాట్లు ఏర్పాటు చేశారు. గ్రామస్థులందరూ సమష్టిగా కేటాయించిన ప్లాట్లలో నాలుగింటిని గ్రామ అభివృద్ధి పనుల కొరకు వదలివేశారు. ఆ ప్లాట్లలో ఒక దానిలో అంగన్‌వాడీ భవనం నిర్మించా రు. గ్రామానికి చెందిన ప్లాట్లలో అంగన్‌వా డీ భవనం ఎలా నిర్మిస్తారని ఓ వ్యక్తి ఆప్లాట్ల చుట్టూ కంచే వేసి అంగన్‌వాడీ భవనాన్ని మూసివేయించాడు. దీంతో చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రంలోకి వెళ్లేం దుకు వీలులేక చెట్ల కిందనే కూర్చున్నారు. గ్రామస్థులు ఈ విషయాన్ని తహసీల్దారుకు తెలియచేయడంతో గ్రామానికి వెళ్లి అంగన్‌వాడీ భవనం తలుపు తీయించారు. ప్రభుత్వ భూములు ఎవరైనా ఇష్టానుసారంగా ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సీడీపీవో పద్మజాకుమారి ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



కావలి పట్టణం బాపూజీనగర్‌లోని జర్నలిస్టుకాలనీ రోడ్డులో నడిరోడ్డులో ఉన్న విద్యుత్ స్తంభంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఆ రోడ్డులో స్తంభం పక్కనే బీసీ బాలికల హాస్టల్, అనేక గృహాలతో పాటు ఒక ప్రైవేట్ పాఠశాల కూడా ఉంది. దీంతో ఈ రోడ్డు నిత్యం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, చిన్నచిన్న వాహనాలతో రద్దీగా ఉంటుంది. బీసీ హాస్టల్‌కు వెళ్లే మలుపు వద్ద ఉన్న ఈ విద్యుత్ స్తంభం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతోన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి నడి రోడ్డుపై ఉన్న ఆ స్తంభాన్ని పక్కకు మార్చి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

\- కావలి,(ఆంధ్రజ్యోతి)

ఈ కాలువల్లో నీరు పారేదెలా?



లింగసముద్రం పాత చెరువుకు సంబంధించిన పంట కాలువ చిల్లచెట్లతో మూసుకుపోయి అధ్వానంగా మారింది. వర్షాభావ పరిస్థితుల కారణంగా గత ఐదారేళ్ల నుంచి పాత చెరువుకు అరకొరగా మాత్రమే నీరు చేరుతుండడంతో రైతులు ఈ చెరువు కింద పంటలు సాగు చేయలేదు. ఈ చెరువు కింద సుమారు 600 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. పంటలు సాగు చేయక పోవడంతో కాలువలతో పాటు భూముల్లోనూ చిల్లచెట్లు పెరిగిపోయాయి. దీంతో కాలువలు పూడి పోయి, చిల్లచెట్లతో నిండి పోయాయి. కనీసం ఈ ఏడాదైనా వర్షాలు కురిసి చెరువులోకి పూర్తి సామర్థ్యంతో నీరు చేరితే ఆ నీరు పంట కాలువలకు వచ్చే పరిస్థితి లేదు. అధికారులు వెంటనే కాఉలవల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

\- లింగసముద్రం,(ఆంధ్రజ్యోతి)

అడుగడుగున చెత్త కంపు



వలేటివారిపాలెం మండల కేంద్రంలో ప్రధాన రహదారులు అపరిశుభ్రంగా మారాయి. రహదారుల పక్కనే చెత్త వేస్తుండడంతో ఆ మార్గంలో ప్రయాణించాలంటే ముక్కుపుటాలు అదిరేలా దుర్వాసన వెదజల్లుతోంది. ప్రతి రోజూ వీధులను శుభ్రం చేయాల్సిన క్లాప్ మిత్రలు 15 రోజులకొకసారి శుభ్రం చేస్తున్నారు. దీంతో వీధుల్లో చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకపోతోంది. అంతేగాకుండా సేకరించిన చెత్తను చెత్తసంపద కేంద్రానికి తరలించకుండా రహదారుల పక్కనే పడేస్తున్నారు. దీంతో అది అక్కడే కుళ్లి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారి దుర్వాసన వస్తోంది. పర్యవేక్షించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి ప్రతిరోజు చెత్తను చెత్త సంపద కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

\- వలేటివారిపాలెం,(ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని నియంత్రించాలి

కావలి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేసి ఫీజుల దోపిడీని నియంత్రించాలని పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరువది భాస్కర్ కోరారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో విద్యార్థుల తల్లితండ్రులతో కలిసి శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలన్నీ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందినవైనప్పటికీ ప్రభుత్వ నిబంధనలను అమలు పరచటంలో కావలి డివిజన్‌లో విద్యాశాఖ అధికారులు ఎందుకు విఫలం చెందుతున్నారని ప్రశ్నించారు. దీని వెనుక ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి అధికారులకు ముడుపులు ఏమైనా ముట్టాయా అనే అనుమానాలు వ్యక్త మవుతోన్నాయని చెప్పారు. తల్లిదండ్రులు, విద్యాశాఖ అధికారులతో గవర్నింగ్ బాడీ నియమించి ఫీజులను నిర్ణయించి వాటిని నోటీస్ బోర్డులో డిస్‌ప్లే చేయాల్సి ఉన్నా ఎక్కడా అలా జరగటంలేదన్నారు. విద్యాసంస్థలు రీ ఓపెనింగ్ సమయంలో విద్యాసంస్థలను పర్యవేక్షిస్తున్న దాఖలాలు లేవన్నారు. ఒక్క ఫీజుల దోపిడీనే కాకుండా బుక్స్ యూనిఫామ్ పేరుతో అదనపు వసూలు చేస్తున్నారని చెప్పారు. ప్రతి విద్యాసంస్థ 25 శాతం ఉచిత సీట్లు ఇవ్వాలనే నిబంధన ఉన్నా అదికూడా అమలు కావడంలేదన్నారు. వీటిపై విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోక పోతే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పోరాటాలు చేపట్టాల్సి వస్తోందన్నారు. ఈ సమావేశంలో విద్యార్థుల తండ్రులు ఆమంచి సుబ్బు, కే. మహేంద్ర పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కందుకూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కందుకూరు డివిజన్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9.30 గంటలకు పట్టణ పోలీసుస్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ సీహెచ్ వీ బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. రోగుల ప్రాణాలను నిలబెట్టడంలో ఎంతో ప్రాధాన్యత కలిగిన రక్తదానం చేయటంలో పోలీసు సిబ్బంది ఎల్లవేళలా ముందుండటమే గాక అనేక సందర్భాలలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తూ తమవంతు సామాజిక బాధ్యతలో ముందుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పోలీసు అధికారులు, సిబ్బందితో పాటు యువత ముందుకొచ్చి రక్తదానం చేయటం ద్వారా విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి పేర్కొన్నారు.

200 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు మొత్తం 548 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 348 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-180, ఆర్‌ఆర్-8, సీఆర్-8, జంపింగ్‌లాట్స్-4 కారణాలతో 200బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సగటు ధర రూ.249.58గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

శ్రీనివాస హేచరీలో బాలుడికి ప్రమాదం

● ఆలస్యంగా వెలుగులోకి... ● బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు



శ్రీనివాస హేచరీ ప్రతినిధిని ప్రశ్నిస్తున్న ఎస్ఐ అంకమ్మ

ఉలవపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కరేడు పంచాయతీ అలగాయపాలెం తీర ప్రాంతంలోని శ్రీనివాస హేచరీలో పని చేస్తున్న 16 ఏళ్ల బాలుడు ప్రమాదానికి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధిత బాలుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంకమ్మ తెలిపారు. పోలీసు ల కథనం మేరకు.. అనకా పల్లి జిల్లా, పాయకరంపల్లి మండలం ఈదటం గ్రామానికి చెందిన నెమల తేజ తాతారావు 10వ తరగతి చదువుతున్నాడు. కాగా అదే ప్రాంతానికి చెందిన బాలుడి స్నేహితుడు నగేష్ కొంతకాలంగా అలగాయపాలెంలోని శ్రీనివాస హేచరీలో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. వేసవి సెలవులు కావడంతో తాతారావు తన స్నేహితుడి నగేష్ దగ్గరకు వచ్చి మే 3వ తేదీన శ్రీనివాస హేచరీలో పనికి చేరాడు. అదే నెల 27వ తేదీన రొయ్య పిల్లల ట్యాంక్ శుభ్రం చేస్తున్న క్రమంలో కాలుజారి నిచ్చెన పై నుంచి కిందపడి తలకు బలమైన గాయాలయ్యాయి. అదేసమయంలో బక్కెట్‌లోని యాసిడ్ కళ్లల్లో పడింది. హేచరీ యాజమాన్యం క్షతగాత్రుడిని ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రిలో చికిత్స చేయించి బాలుడి స్వగ్రామానికి పంపించారు. బాలుడి తల్లిదండ్రులు తుని ఆసుపత్రిలో వైద్యులకు చూపించగా తలకు శస్త్రచికిత్స చేయాలని సూచించారు. ఆసుపత్రిలో బాలుడు ఫిర్యాదుని నమోదు చేసుకున్న వైద్యులు ఉలవపాడు పోలీసులకు సమాచరం అందించారు. దీనిపై శుక్రవారం ఎస్ఐ అంకమ్మ, లేబర్ ఇన్‌స్పెక్టర్ సుజాతతో కలిసి శ్రీనివాస హేచరీకి వెళ్లి బాల కార్మికులు ఉన్నారేమోనని తనిఖీలు చేసి, అందిన ఫిర్యాదుపై హేచరీ యాజమాన్యంను విచారించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులమనే గుర్తింపు తొలగించండి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ ఆయాలు

ఉలవపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు కావడంతో తమకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలకు అనర్హులుగా ప్రకటిస్తున్నారని మండలంలోని అంగన్‌వాడీ ఆయాలు సీఐటీయూ జిల్లా నాయకత్వంతో కలిసి శుక్రవారం తహసీల్దారు టీ శ్రీనివాసులకు వినతిపత్రం అందచేశారు. ఆయాలకు ప్రభుత్వం నుంచి గౌరవ వేతనంగా నెలకు రూ.7000 అందుతుండని, గత ప్రభుత్వంలో వలంటీర్లు, సచివాలయం సిబ్బంది చేపట్టిన హౌస్ మ్యాపింగ్‌లో అంగన్‌వాడీ ఆ యాలు రూ.12000 జీతం తీసుకుంటున్నారని నమోదు కావడంతో గ్యాస్, ఎస్సీ, ఎస్టీ ఉచిత కరెంటు బిల్లు, తల్లికి వందనం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అనర్హులుగా మిగిలిపోయా మన్నారు. తమకు తగిన న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ ఆయా లు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకుంటేనే 'అన్నదాత సుఖీభవ'

● బాధ్యతలు స్వీకరించిన వ్యవసాయాధికారి శేషారెడ్డి



వ్యవసాయాధికారి శేషారెడ్డి

వలేటివారిపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ నగదు జమ అవుతుందని ఏవో శేషారెడ్డి తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో నూతన ఏవోగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన శేషారెడ్డి ముందుగా ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే నెలలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నదాత సుఖీభవ నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన అర్హుల జాబితా గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద ఉందని చెప్పారు. రైతులు తమ ఆధార్‌కార్డుతో రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. మండలంలో అన్నదాత సుఖీభవకు 6008 మంది రైతులు అర్హత కలిగి ఉన్నట్లు చెప్పారు.

● **గుడ్లూరు** : అన్నదాత సుఖీభవ పథకం పొందే ప్రతి రైతు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని మండల ఏవో రవికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల జాతతా, ఈకేవైసీ కోసం, అయా గ్రామల వ్యవసాయ, ఉద్యానవన సహాయకుల లాగిన్‌కు వచ్చి ఉన్నాయని, ఈ విషయన్ని ప్రతిరైతు గమనించాలన్నారు. ఈకేవైసీ చేయించుకోని రైతులకు పథకం వర్తించదని ఆయన పేర్కొన్నారు.

సామాజిక కార్యకర్త వరప్రసాద్‌కు సత్కారం



వరప్రసాద్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత, వైద్యులు

కావలిటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అనేక పర్యాయాలు రక్తదానం చేయడమే కాక రక్తదాతలను ప్రేరేపుతుడుగా సేవలందిస్తున్న సామాజిక కార్యకర్త, బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్రసాద్‌ను శుక్రవారం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో వైద్యులు ఘనంగా సత్కరించారు. ప్రపంచ రక్తదాతల దినోత్స వంలో భాగంగా జరుగుతున్న వారోత్సవాల్లో ఏరియా వైద్యశాలలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో బ్రిజిత, సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి, డాక్టర్ ప్రమీల తదితర వైద్యులు వరప్రసాద్‌ను శాలువా సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

పశుసంవర్ధక శాఖ ఏడీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన ఏడీ చెన్నకేశవులు

వలేటివారిపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్‌గా డాక్టర్ చెన్నకేశవులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం వైద్యశాల నుంచి బదిలీపై వలేటివారిపాలెం వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏడీ బ్రహ్మయ్య బదిలీపై అద్దంకి వెళ్లారు. ఈయన గతంలో వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాల్లో పశువైద్యాధికారిగా పనిచేశారు.

సాగునీటిని వృథా చేయొద్దు



● బీ.నాగార్జునరెడ్డి, జేఈ, సోమశిల ప్రాజెక్ట్

జలదంకి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రెండో పంటకు విడుదల చేసిన సోమశిల జలాలను రైతులు పొదుపుగా వాడుకోవాలి. ఉన్న నీటిని వృథా చేస్తే చివరి తడులకు తగ్గే ప్రమాదం ఉంది. చేసిన కేటాయింపులను సద్వినియోగం చేసుకుని పంటలు పండించుకోవాలని సోమశిల ప్రాజెక్ట్ జేఈ బీ.నాగార్జునరెడ్డి తెలిపారు.

ఈ ఇంటర్వ్యూ

? చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు కావలి కాలువ ద్వారా సోమశిల జలాలు ఎంత నీరు చేరుతోంది. ఏఏ బ్రాంచ్ కాలువలకు సరఫరా చేస్తున్నారు.

! సీబీఆర్‌కు సరాసరి 300 క్యూసెక్కులు చేరుతోంది. సంగం ఆనకట్ట వద్ద 650 క్యూసెక్కులు కావలి కాలువకు విడుదలవుతుండగా బ్రాహ్మణక్రాక, హనుమకొండపాలెంతో సహా అన్ని మేజర్, మైనర్ కాలువలకు పోను సీబీఆర్‌కు 300 క్యూసెక్కులు చేరుతున్నాయి.

? కావలికాలువ పూడికతీత అనంతరం నీటిసరఫరా ఎలా ఉంది.

! కావలికాలువ పూడికతీత అనంతరం నీటి సరఫరా బాగుంది. సంగంలో విడుదల చేసిన నీరు 24గంటల వ్యవధిలో సీబీఆర్‌కు చేరాయి. కాలువలో 1000 క్యూసెక్కుల నీరు సరఫరాకు అవకాశం ఏర్పడింది. కాలువ పూడికతీతతో ఆయకట్టు రైతులకు సమృద్ధిగా సాగునీరు సరఫరా చేసుకునే వీలు కలిగింది.

? నీటి వాడకంపై రైతులకు ఎలాంటి సూచనలు ఇస్తున్నారు.

! సాగునీరు అవసరం మేరకు వాడుకునే విధంగా వ్యవసాయశాఖ అధికారులతో రైతులకు, సాగునీటి సంఘాల ప్రతినిధులకు సమావేశం ఏర్పాటు చేసి నీటి వాడకంపై తగిన సూచనలు ఇచ్చాం. రైతులు సాగునీరు వృథా చేయకుండా అవసరం మేరకు వాడుకోవాలి.

? సాగునీటి సరఫరాలో నీటి సంఘాల బాధ్యతలేంటి.

! సాగునీటిని విడుదల చేయడంతో పాటు రైతులకు అందేవిధంగా పూర్తిస్థాయిలో సాగునీటి సంఘాల ప్రాధాన్యత అధికం. వారు చెప్పిన విధంగా కాలువలకు సాగునీరు విడుదల చేయడం జరుగుతోంది. నీటిసంఘాల ప్రతినిధులతో ఎప్పటికప్పుడు తాము చర్చిస్తూ సమన్వయంతో పనిచేస్తున్నాం.

ఉపాధి హామీ పనుల పరిశీలన

వలేటివారిపాలెం, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోకూరు, నలదలపూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం ఏపీవో దయాసాగర్ పరిశీలించారు. పనుల్లో సమయపాలనతో పాటు కొలతల ప్రకారం పనిచేయాఆలన్నారు. అప్పుడే గిట్టుబాటు కూలి వస్తుంది పేర్కొన్నారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్‌లు సుబ్బారాయుడు, రామకృష్ణ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కావలి పట్ట ణం వెంగళరావు, పుల్లారెడ్డినగర్, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ప్రాంతాలకు శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వర కు విద్యుత్ సరఫరా ఉండదని కావలి టౌన్-1, టౌన్-2 అసిస్టెంట్ ఇంజనీర్‌లు నాగార్జున, వ సంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యు త్‌లైన్లపై ఉన్న చెట్ల కొమ్మలు, చెట్లు తొలగించ టం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్, సబ్‌స్టేషన్ మర మ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

● కావలిటౌన్-1లో పుల్లారెడ్డినగర్, రాజీవ్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని మాగుంట పార్వతమ్మ ట్రంకు రోడ్డుకు తూర్పున ఉన్న అన్ని ప్రాంతాల్లో, ట్రంకు రోడ్డుకు పడమర ఉన్న వడ్డిపాలెం, కలుగోళ్లమ్మపేట, సంకరవారి తోట, వాయునందన ప్రెస్ రోడ్డు తదితర ప్రాం తాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

● కావలిటౌన్-2 పరిధిలో రైల్వేట్రాక్‌కు పడమర వైపున వెంగళరావునగర్, ఇందిరానగర్, తుఫాన్‌నగర్, బాలకృష్ణారెడ్డి నగర్, జనతాపేట, మున్సిపల్ ప్లాట్స్, వైకుంఠపురం, పెంకుల ఫ్యాక్టరీ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డుకు పడమర వైపున కచ్చేరిమిట్ట, క్రిస్టియన్‌పేట, కోఆపరేటివ్‌కాలనీ, రైల్వేరోడ్డు, కోర్టు పరిసర ప్రాంతాలు, రాజావారి వీధి, అప్ప ల అగ్రహారం, ఏరియా ఆసుపత్రి పరిసరాలలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజ లు గమనించి సహకరించాలని కోరారు.

● **అల్లూరు** : మండలంలోని అల్లూరు, నార్తుమోపూరు సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మ ధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా కు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ మస్తాన్‌షరీఫ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో అల్లూరు, నార్తుమోపూరు, బీరం గుంట, నార్తుఆములూరు, బట్రకాగొల్లు, గ్రద్ద గుంట గ్రామాల్లో విద్యుత్ సరఫరాను ఉండదని పేర్కొన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని తెలిపారు.

● **బిట్రగుంట** : విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వి ద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ జడరాయ్ శుక్రవారం ఓ ప్రకట నలో తెలిపారు. దీంతో చెంచులక్ష్మీపురం, జక్కే, పల్లిగూడూరు, ముంగమూరు, వడ్డిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

పునీత అంథోని జన్మదిన వేడుకలు



పురవీధుల్లో ఊరేగుతున్న పునీత అంథోని

బిట్రగుంట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బోగోలు అరవపాలెంలోని అంథోని మందిరంలో శుక్రవారం పునీత అంథోని జన్మదిన వేడుకలు నిర్వహించారు. సాయత్రం ఊరేగింపు జరిగింది. జూన్ ఒకటవ తేదీ నుంచి 13 రోజుల ప్రార్థనల అనంతరం అంథోని ప్రతిమకు పూల అలంకరణతో ఆర్సీఎం చర్చి నుంచి ఊరేగింపు నిర్వహించారు. పునీత అందోనితో పాటు వేళాంగినీమాత, బాలయేసు ప్రతిమలు ప్రత్యేక పూల అలంకరణతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో బోగోలు, విశ్వనాథరావుపేట తదితర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సిబ్బంది రక్తదానం

కందుకూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 70వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక రీజనల్ ఆఫీసులో రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో బ్యాంకు సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని ముగ్గురు విద్యార్థినులకు సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ మేనేజరు అప్పలరాజు, మేనేజరు ఆర్. శ్రీనివాసనాయక్, రీజనల్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం అప్పలరాజు

ఇక పంచాయతీలకు గ్రేడ్‌లు!

(5వ పేజీ తరువాయి)

వ్యవస్థను తొలగించాలని నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా ప్రతి జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపాలని కోరారు.

● ప్రభుత్వానికి చేరిన ప్రతిపాదనలు

ప్రభుత్వ సూచనలతో పంచాయతీ అధికారులు నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. జిల్లాలో 722 పంచాయతీలు ఉండగా వాటిలో కోటి ఆదాయం కలిగి 10వేల జనాభా ఉన్న పంచాయతీలను స్పెషల్ గ్రేడ్ పరిధిలోకి వస్తాయి. అలాంటి పంచాయతీలు జిల్లాలో 15 ఉన్నట్లు లెక్క తేల్చారు. 50లక్షలు ఆదాయం కలిగి 5వేల నుంచి 10వేలలోపు జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడ్-1గా తేలుస్తూ 73 పంచాయతీలు ఉన్నట్లు నివేదికలో పేర్కొన్నారు. 2వేల నుంచి 5వేలలోపు జనాభా ఉన్న పంచాయతీలు గ్రేడ్-2 కిందకి రానున్నాయి. ఇవి 183 పంచాయతీలు ఉన్నాయి. ఇక 2వేలలోపు జనాభా కలిగిన పంచాయతీలు 451 ఉన్నాయి. వాటి వివరాలను ప్రభుత్వానికి పంపారు. క్యాబినేట్‌లో ఆమోద ముద్ర పడగానే పంచాయతీలకు గ్రేడ్‌ల వ్యవస్థ ఏర్పాటు కానుంది. అలాగే ప్రతి పంచాయతీకి ప్రత్యేకంగా ఓ కార్యదర్శి ఉండనున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత మాలేపాటి

బిట్రగుంట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండ లం విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వి ద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను శుక్ర వారం టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్‌రావు ఆధ్వర్యంలో జరి గిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఎల్.సుధీర్‌బాబు, సహోపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారి బాధ్యతల స్వీకరణ

కలిగిరి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మనుబోలు మండ లం నుంచి బదిలీపై కలిగిరికి వచ్చిన వ్యవ సాయాధికారి షేక్ జహీర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సురేష్‌బాబు ఏఎస్‌పేట మండలానికి బదిలీ అయ్యారు. ఆయనకు ఏఈవోలు చి రంజీవి, సునీల్, వీపీఏ, వీహెచ్ఏ అభినందనలు తెలిపారు.

వానవిల్లు ఊసులు



కొండలబారుతో తెల్లని మబ్బులు పోటీపడ్డాయి. తేలాడుతూవచ్చి నగరానికి గొడుగుపట్టాయి. దిగ్గున మెరిసి, ధమధమ ఉరిమి.. కారునలుపును పులుముకున్నాయి. చల్లని గాలి పలకరించగానే ఇంద్రధనుస్సు పురివిప్పుకుంది. ఝల్లున కురిసిన వానకు నగరం తడిచి ముద్దై పులకరించింది. శుక్రవారం సాయంత్రం తిరుపతిలో కనిపించిన దృశ్యాలు

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి





తల్లి.. తబ్బిబ్బయి



- పిల్లలు ఎందరున్నా 'తల్లికి వందనం'
- వైసీపీతో పోలిస్తే రూ.54.562 కోట్ల అదనపు ప్రయోజనం
- పేద కుటుంబాల్లో పండగ వాతావరణం

2025.. తల్లికి వందనం
అర్హులు: 2,10,407 మంది
జమ చేసింది: రూ.273.52 కోట్లు

2023.. అమ్మఒడి
అర్హులు: 1,68,367 మంది
జమ చేసింది: రూ.218.87కోట్లు

వ్యత్యాసం: వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే ఇప్పుడు 40,040 మంది పిల్లలకు అదనంగా ప్రయోజనం లభించింది. రూ.54.6520 కోట్లు అదనంగా జమయింది.

ఒక బిడ్డ ఉంటే రూ.13 వేలు. ఇద్దరికైతే రూ.26 వేలు.. ముగ్గురున్న వారికి రూ.39 వేలు. ఇలా 'తల్లికి వందనం' పథకం కింద శుక్రవారం తల్లుల ఖాతాల్లో నగదు జమ అయింది. గత ప్రభుత్వం ఎంత మంది పిల్లలుంటే అంతమందికి 'అమ్మ ఒడి' ఇస్తామని, చివరకు ఒకరికేనంటూ మోసం చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎన్నికల నాటి హామీని నిలబెట్టుకోవడంతో విద్యార్థుల తల్లులకు వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే రూ.54.562 కోట్ల వరకు అదనపు లబ్ధి చేకూరింది. అలాగే, 42 వేల మంది పిల్లలకు అధికంగా మేలు కలిగింది. అదే సమయంలో ఒకరికంటే ఎక్కువ మంది పిల్లలున్న తల్లులకు రెట్టింపు నుంచీ నాలుగు రెట్ల వరకూ ప్రభుత్వం నుంచీ ఆర్థిక సాయం అందింది. స్కూలు, ఇంటర్ చదివే పిల్లలు ఎంత మంది ఉన్నా అందరికీ నగదు జమ కావడంతో ఆయా కుటుంబాల్లో పండగ వాతావరణం నెలకొంటోంది. ముఖ్యంగా ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలుండి లబ్ధి అందుకున్న కుటుంబాల్లో సంబరం చెప్పనలవి కావడం లేదు. మొత్తమ్మీద జిల్లాలో తల్లికి వందనం పథకం కింద లబ్ధి పొందిన 1.40 లక్షల కుటుంబాల్లో సంబరం మిన్నంటింది. లబ్ధిదారుల ముఖాల్లో ఆనందోత్సాహాలు స్పష్టంగా కనిపించాయి. తల్లికి వందనం నిధులు బ్యాంకు ఖాతాలో జమ అయినట్టు మొబైల్ ఫోన్లకు వచ్చిన సంక్షిప్త సందేశాలు చూసుకుని మురిసిపోతూ కనిపించారు. కొంత మంది తమ ఖాతాల్లో నగదు జమ అయిందా లేదా అని చెక్ చేసుకుంటూ, మరికొంత మంది నేరుగా బ్యాంకుకు వెళుతూ హడావిడిగా కనిపించారు. ఖాతాల్లో నగదు జమయిన వారు ఆ విషయం ఇరుగుపొరుగు వారితో చెప్పుకుని సంబరపడ్డారు. శుక్రవారం రోజంతా దాదాపు ఎక్కడ చూసినా దీనిపైనే ఎక్కువగా చర్చ సాగింది.


తమ ఖాతాల్లో నగదు జమయిందా అని సూళ్లూరుపేటలోని యూనియన్ బ్యాంకులో చెక్ చేసుకుంటున్న తల్లులు

ప్రత్యేకత: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఎంత మంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం' కింద నగదు జమ చేసింది.

నిరుపేద కుటుంబానికి పెద్ద సాయం


పిల్లలతో చిరు వ్యాపారి భవాని

తిరుపతి ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న భవానీ, అశోక్ దంపతులకు నలుగురు ఆడ పిల్లలు. భవానీ తోపుడు బండిపై కాస్మొటిక్స్ విక్రయిస్తూ, అశోక్ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. నలుగురు పిల్లల్లో ముగ్గురు.. కారుణ్య (టెన్త్), భార్గవి (తొమ్మిది), వైష్ణవి (4వ తరగతి) చదువుతున్నారు. ఈ ముగ్గురికీ కలిపి తల్లి భవాని బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం శుక్రవారం రూ.39 వేలు జమ చేసింది. దీంతో ఆ కుటుంబీకుల సంతోషానికి పట్టపగ్గాల్లేకుండా పోయాయి. 'గత ప్రభుత్వం ఒకరికే అమ్మఒడి నగదు వేయగా.. ఇప్పటి ప్రభుత్వం ముగ్గురు పిల్లలకు నగదు వేసింది. ఇలా మా పేద కుటుంబానికి ప్రభుత్వం పెద్ద సాయం చేసింది. సీఎం చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటాం. ఈ డబ్బును ఆడపిల్లల చదువులకే ఖర్చు పెడతాం' అని భవాని అన్నారు.

మరమగ్గం కార్మికుల ఇంట సంబరం


ముగ్గురు పిల్లలతో సుమతి, త్యాగరాజన్ దంపతులు

పుత్తూరు పట్టణానికి చెందిన సుమతి, త్యాగరాజన్ దంపతులు మరమగ్గాల్లో నేత కార్మికులుగా పనిచేస్తున్నారు. వీరికి పవిత్ర (6వ తరగతి), అనుష్క (5వ), వేద (మూడో తరగతి) పిల్లలు. తమ కూలి డబ్బులతో వీరు ముగ్గురు పిల్లలను చదివించడానికి అష్టకష్టాలు పడుతున్నారు. మూడవ తరగతి చదువుతున్నారు. శుక్రవారం సుమతి బ్యాంకు ఖాతాలో రూ.39 వేలు జమయినట్టు మొబైల్ ఫోన్‌కు మెసేజ్ రావడంతో ఆ ఇంట్లో ఒక్కసారిగా సంబరం నెలకొంది. 'గతంలో ఒక బిడ్డకే అమ్మ ఒడి కింద నగదు వచ్చింది. ఇప్పుడు ముగ్గురికీ ఒకేసారి బ్యాంకులో డబ్బు పడడం చాలా సంతోషాన్నిస్తోంది' అని సుమతి చెప్పారు.



ముగ్గురు పిల్లలతో అమరావతి

బిడ్డల చదువుకు ఎంతో ఉపయోగం

బాలాయపల్లి మండలం ఎన్‌సీ కండ్రిగకు చెందిన అమరావతికి ముగ్గురు ఆడపిల్లలు. పెద్దమ్మాయి మమత సెవెన్త్, లక్ష్మీ దీప్తి 4వ తరగతి, స్నేహ 2వ తరగతి చదువుతున్నారు. మునుపు వైసీపీ ప్రభుత్వంలో ఒకరికే అమ్మఒడి వేశారని, ఇపుడు సీఎం చంద్రబాబు ఎన్నికల హామీ ప్రకారం ముగ్గురికీ బ్యాంకులో రూ.13 వేలు చొప్పున నగదు జమ చేయడం చాలా సంతోషంగా ఉందని అమరావతి చెప్పారు. తన ముగ్గురు పిల్లలకు చేసిన ఆర్థిక సాయం బిడ్డల చదువుకు ఎంతో ఉపయోగపడుతుందని ఆమె అన్నారు. ఈ డబ్బును బిడ్డల చదువుకే ఖర్చు పెడతామని స్పష్టం చేశారు.


ముగ్గురు పిల్లలతో మమత

పేద కుటుంబానికి ఊహించని సాయం

ఈ ఫొటోలో కనిపిస్తున్నది డక్కిలికి చెందిన అంకుపల్లి మమత, ఆమె ముగ్గురు ఆడ బిడ్డలు. ఈ పిల్లలు ముగ్గురూ డక్కిలిలోనే ప్రభుత్వ స్కూల్లో చదువుతున్నారు. మమత భర్త కారు డ్రైవరుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ముగ్గురు పిల్లలకూ ఒకేసారి రూ.13 వేల లెక్కన తన బ్యాంకు ఖాతాలో రూ.39 వేలు జమ అయినట్టు ఫోన్‌కు మెసేజ్ వచ్చిందని మమత చెప్పారు. దాంతో పట్టలేని సంతోషం కలిగిందన్నారు. తమలాంటి పేద కుటుంబానికి చంద్రబాబు ప్రభుత్వం నుంచీ ఇది ఊహించని సాయమన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

శేషాచలంలో కొత్త పాము

- తూర్పు కనుమల్లో తొలిసారిగా రియోపా డెక్కనెన్సిస్ గుర్తింపు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్యానికి కేంద్రమైన శేషాచలంలో మరో అరుదైన పాము కనిపించింది. రియోపా డెక్కనెన్సిస్‌గా పిలవబడే ఈ పామును తొలిసారిగా తూర్పు కనుమల్లో గుర్తించారు. ఈ వివరాలు జూటాక్సా అనే ఇంటర్నేషనల్ జర్నల్‌లో జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జడ్ఎస్ఐ) వెల్లడించింది. కనురెప్పలు అత్యంత పారదర్శకంగా, చారలు విభిన్న రేఖాంశంగా, శరీరం తక్కువ మందంతో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ జీవిపై పరిశోధనలో హైదరాబాదులోని బయాలజీ రీజినల్ సెంటర్, జువాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, లండన్‌కు చెందిన నేచురల్ హిస్టరీ మ్యూజియం శాస్త్రవేత్తలు భాగస్వామ్యం వహించారు. సాధారణ పాము కంటే భిన్నంగా ఈ పాముకు శరీరంపై రెండు చోట్ల కాళ్ల ఆకారంగా కనబడుతోంది.

కొండపై ఫ్రీబస్ ట్రయల్ రన్

తిరుమల, జూన్13(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై భక్తులు ఎక్కడైనా ఉచితంగా ప్రయాణించేలా తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఆర్టీసీ ట్రయల్ రన్ నిర్వహించింది. రేణిగుంట ఎయిర్‌పోర్టు నుంచి తిరుమలకు వచ్చిన 10 ఎలక్ట్రిక్ బస్సులను ప్రస్తుతం టీటీడీ ఉచిత బస్సులు తిరుగుతున్న రూట్లలో గురు,శుక్రవారాల్లో తిప్పారు. మరికొన్ని రోజుల పాటు బస్సుల సంఖ్యను పెంచుతూ ఇలానే ట్రయల్‌రన్ నిర్వహిస్తారు.

జాతీయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 3న ప్రకటించే జాతీయ అవార్డులు-2025 కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాలలో అత్యున్నత ప్రతిభ, అసాధారణ విజయాలు సాధించిన దివ్యాంగులు, సంస్థలు అర్హులని పేర్కొన్నారు. రాష్ట్రీయ పురస్కార పోర్టల్ 'అవార్డ్స్‌జీవోవీ.ఇన్' ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 94405 73537ను సంప్రదించాలని కోరారు.

స్పోర్ట్స్ సర్టిఫికెట్ల పరిశీలన

- 349 మంది హాజరు


కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వర్సిటీల్లో ఎంపీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి ఎస్వీయూలో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన 349 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఎస్వీయూ వీసీ అప్పారావు, పీజీ సెట్ కన్వీనర్ పీసీ వేంకటేశ్వర్లు పరిశీలించారు.పరిశీలకులుగా శివశంకర్‌రెడ్డి(ఎస్వీయూ),శ్రీనివాస్ (ఎస్కేయూ), రామసుబ్బారెడ్డి (వైవీయూ), పాల్ (ఏఎన్‌యూ) పాల్గొన్నారు.

జిల్లా సివిల్ సప్లై మేనేజరు సుమతి బదిలీ

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లా సివిల్ సప్లైస్ మేనేజరుగా పనిచేస్తున్న సుమతి అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. చిత్తూరులో పనిచేస్తున్న బాలకృష్ణను తిరుపతికి నియమిస్తూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఎండీ మంజీర్ జిలానీ సామ్యాన్ ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు నుంచి లక్ష్మిని చిత్తూరుకు బదిలీ చేశారు.

బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలి

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 13(ఆంధ్రజ్యోతి): 9, 10 తరగతులు, ఇంటర్ చదువుతున్న షెడ్యూల్ కులాల విద్యార్థులు తల్లికి వదనం పథకంలో స్కాలర్‌షిప్ మంజూరుకు తల్లి బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.బ్యాంకు ఖాతా లేకపోతే పోస్టల్ బ్యాంకులో నూతన ఖాతాలను తెరచి ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోవాలని పేర్కొన్నారు. శనివారం గ్రామ, వార్డు సచివాలయాల్లో పోస్టల్ శాఖ ప్రత్యేక క్యాంపు నిర్వహిస్తోందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హొస్కోటలో ప్రమాదం

లారీని దాటబోయి ఢీకొన్న బస్సు

చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన ఐదుగురి మృతి

ఇద్దరు బస్సు డ్రైవర్లు సహా 14 మందికి గాయాలు

వెదురుకుప్పం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): బెంగళూరు శివారు హొస్కోటలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో చిత్తూరు జిల్లాకు చెందిన నలుగురు, తిరుపతి జిల్లావాసి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. 14మంది గాయపడ్డారు. తిరుపతి నుంచి బెంగళూరుకు చిత్తూరు-2 డిపో బస్సు గురువారం రాత్రి 31మందితో బయల్దేరింది. తెల్లవారుజామున 2 గంటల సమయంలో హొస్కోట సమీపంలో గొట్టిపుర గేట్ వద్ద లారీని ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పి ఢీకొట్టింది. బస్సు కుడివైపు సగందాకా తుక్కుతుక్కు అయిపోయింది. డ్రైవర్ వెనుకవైపు కూర్చున్నవారిలో ఐదుగురు మృతిచెందారు. మృతుల్లో తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం తిమ్మరాజుపల్లెకు చెందిన హరిబాబు కుమార్తె ప్రణతి(5), చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగుకు చెందిన కె.జనార్దన రెడ్డి కుమారుడు 40రోజుల వయసున్న హేత్విక్, కె.కేశవులురెడ్డి(44), ఎస్ఆర్ పురం మండలం పుల్లూరుకు చెందిన తులసి అలియాస్ తనూజ(22), బెంగుళూరులోని జేపీనగర్‌లో స్థిరపడ్డ గంగాధర నెల్లూరు మండలం మారేడుపల్లెకు చెందిన శారద(43) ఉన్నారు.


ప్రణతి మృతదేహం, చికిత్స పొందుతున్న కాత్యాయని, మాధురి

గంగమ్మ ఉత్సవాలకని వచ్చి..

రామచంద్రాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండలం తిమ్మరాజుపల్లికి చెందిన ఒంటే హరిబాబు బెంగళూరులోని ఆర్మీలో ట్రైనింగ్ అధికారిగా పనిచేస్తున్నారు. వేసవి సెలవుల ముందు వరకూ భార్య రోహిణి, ముగ్గురు కుమార్తెలు స్వగ్రామంలోనే ఉండేవారు. పిల్లలు ఇక్కడే చదివారు. వేసవి సెవుల్లో బెంగళూరుకు కాపురం మార్చారు. స్వగ్రామంలో గంగమ్మ ఉత్సవాలకు కుటుంబ సభ్యులతో వచ్చారు. తిరిగి గురువారం రాత్రి బెంగళూరుకు బస్సులో ప్రయాణమవగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈయన చిన్నకుమార్తె ప్రణతి మృతి చెందింది. మిగిలిన ఇద్దరు కుమార్తెలకు తీవ్రగాయాలయ్యాయి.

బంగారుపాళ్యం ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం


వక్కల రాజేంద్రనాయుడు - సాదరయ్య (ఫైల్‌ఫొటో)

బంగారుపాళ్యం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి శుక్రవారం అమిత వేగంతో వస్తున్న కారు బంగారుపాళ్యం మండలం తిమ్మోజుపల్లె సమీపంలోని రాజేంద్రనాయుడు మామిడి తోట వద్దకొచ్చేసరికి అదుపుతప్పింది. ఆపై అక్కడున్న సర్వీసు రోడ్డులో నిలబడి మాట్లాడుకుంటున్న తిమ్మోజుపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వక్కల రాజేంద్రనాయుడు (54), తంగరాజు కుమారుడు సాదరయ్య(45)పైకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో రాజేంద్రనాయుడు అక్కడికక్కడే మృతిచెందగా.. సాదరయ్యకు తీవ్రగాయాలై మామిడితోపులోకి ఎగిరిపడ్డాడు. కారు నుజ్జునుజ్జవడంతో అందులోని సయ్యద్ దిలీప్.. సీట్ల మధ్యలో ఇరుక్కుని మృతి చెందాడు. ఆయన భార్య, కుమార్తె, మనవరాలికి తీవ్రగాయాలయ్యాయి. అసురక్షితంగా బయటపడ్డాడు. బంగారుపాళ్యంలో ప్రథమ చికిత్స అందించి చిత్తూరుకు తీసుకెళుతుండగా సాదరయ్య మృతి చెందాడు. కాగా, సాదరయ్య బంగారుపాళ్యం మండలంలో వ్యవసాయశాఖ విస్తరణ అధికారిగా పనిచేస్తూ రెండ్రోజుల కిందటే గంగవరం మండలానికి బదిలీపై వెళ్లారు.

భూదేవి కాంప్లెక్స్ వద్ద క్యూలైన్లు, షెడ్లు



తిరుమల, జూన్13(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని అలిపిరి వద్ద భూదేవి కాంప్లెక్స్ లోస్లాటెడ్ సర్వదర్శనం(ఎస్ఎస్‌డీ) టోకెన్లు జారీ చేసే కేంద్రాల వద్ద పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు వసతులు ఏర్పాటు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ప్రస్తుతం 430 మీటర్లు నిర్మిస్తున్న క్యూలైన్‌ను మరో 150 మీటర్ల మేరకు పెంచనున్నారు. ఎండ, వానలకు ఇబ్బంది లేకుండా 2,400 మంది వేచిఉండేలా రెండు శాశ్విత షెడ్లను నిర్మించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందువల్ల క్యూలైన్లతో కలిపి 5600 మందికి సౌకర్యం కలుగుతుంది. అలాగే భూదేవి కాంప్లెక్స్ పైఅంతస్థును కూడా టోకెన్ల కోసం వచ్చే భక్తులకు వినియోగించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. శ్రీనివాసంలోనూ శాశ్విత క్యూలైన్ల నిర్మాణం కోసం టీటీడీ ప్రణాళికలు రూపొందిస్తోంది. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఇంజినీరింగ్ అధికారుల బృందం టోకెన్ల జారీ కేంద్రాలను పలుమార్లు పరిశీలించాక ఈ ప్రతిపాదన సిద్ధం చేశారు.



భూదేవి కాంప్లెక్స్ వద్ద స్లాటెడ్ సర్వదర్శన టోకెన్ల కోసం వేచిఉన్న భక్తులు

శిలాతోరణం సర్కిల్ దాకా క్యూ

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం మీదుగా రింగురోడ్డులో శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.11 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,609

తలనీలాలు సమర్పించినవారు: 33,144



నడకదారిలో భద్రత భేష్!



సేవకుడికి ఫీడ్‌బ్యాక్ ఇస్తున్న సురేష్‌బాబు

తిరుమల, జూన్13(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఏర్పాట్లు అన్నీ చాలా బావున్నాయని నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబు చెప్పారు. కాలినడకన తిరుమలకు వచ్చిన ఆయన శుక్రవారం ఉదయం శ్రీవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, నడకమార్గంలో భక్తుల భద్రత కోసం తీసుకున్న జాగ్రత్తలు బావున్నాయని అన్నారు.ప్రసాదాల రుచి బావుందని చెప్పారు. తిరుమలలో సేవలపై సురేష్‌బాబును ఒక సేవకుడు ఫీడ్‌బ్యాక్ కోరగా ఓపికగా అన్ని ప్రశ్నలకూ సమాధానాలు ఇచ్చారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



రాజ్యసభ కమిటీ

తిరుమల, జూన్13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ప్రభుత్వ హామీల రాజ్యసభ కమిటీ ఛైర్మన్ తంబిదొరై, సభ్యులు, ఎంపీ పార్థసారథి, రాజస్థాన్ మంత్రులు జవహర్ సింగ్ బేఢం, కృష్ణకుమార్ బైష్ణోయ్, సెల్కాన్ ఎండీ గురుస్వామిని నాయుడు ఉన్నారు. దర్శనం అనంతరం రాజస్థాన్ మంత్రులు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని మంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో భారత్ త్వరలోనే ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారనుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

శ్రీసిటీ- నాఫ్ ఇండియా పరిశ్రమకు గ్రీన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న నాఫ్ ఇండియా ప్రతినిధి నాగరాజు కట్టా

శ్రీసిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని నాఫ్ ఇండియా పరిశ్రమకు 'గ్రీన్' (పర్యావరణ హిత సంస్థ) గుర్తింపు దక్కింది. హైదరాబాద్‌లో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఈనెల 12న నిర్వహించిన గ్రీన్‌కో సమ్మిట్‌లో ఈ అవార్డును నాఫ్ ఇండియా పరిశ్రమకు అందజేశారు. 12, 13 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సులో నికర సున్నా పరివర్తన, వృత్తాకార ఆర్థిక వ్యవస్థ, సుస్థిర అభివృద్ధి, ఏఐ తదితర రంగాలకు సంబంధించి అంతర్జాతీయ నిపుణులు, పరిశ్రమల ప్రముఖులు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు పాల్గొన్నారు. గ్రీన్ అవార్డును అందుకున్న నాఫ్ ఇండియా పరిశ్రమ యాజమాన్యాన్ని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో అభినందించారు.

ఈత సరదాతో ట్రిపుల్ ఐటీ విద్యార్థి మృతి



మురళి (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సరదా కోసం ఈతకు వెళ్లిన ట్రిపుల్ ఐటీ విద్యార్థి మృతి చెందాడు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి మండలం చుక్కలనిడిగల్లుకు చెందిన పెరిమిడి మురళీకృష్ణ(19) శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీ చదువుతున్నాడు. ఇటీవల సెలవులకు ఇంటికి వచ్చాడు. ధనుష్, ప్రశాంత్‌తో కలిసి గురువారం తొట్టంబేడు మండలం సింగమాల వద్ద తెలుగుగంగ కాలువలో ఈత కోసం వెళ్లాడు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో మురళీకృష్ణ గల్లంతయ్యాడు. విద్యార్థి తండ్రి బాలాజీ ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి 2వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలించారు. చీకటి పడడంతో వెనుదిరిగారు. శుక్రవారం మురళీకృష్ణ మృతదేహాన్ని తెలుగు గంగ కాలువలో గుర్తించి ఒడ్డుకు తెచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నేడు మ్యాంగోనగర్‌కు మంత్రి అచ్చెన్న

పాకాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలం దామలచెరువు మ్యాంగోనగర్‌లో శనివారం ఉదయం 11 గంటలకు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పర్యటించనున్నారని ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. మామిడి రైతులు, వ్యాపారులతో సమావేశమై మామిడి ధరలు, అమ్మకాలపై సమీక్షిస్తారన్నారు.

డీఎస్‌డీవోగా శశిధర్



కలెక్టర్‌ను కలిసిన నూతన డీఎస్‌డీవో శశిధర్

తిరుపతి(క్రీడలు), జూన్ 13(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాభివృద్ధి అధికారి(డీ ఎస్ డీ వో)గా ఎన్.శశిధర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సాయంత్రం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. ఇప్పటి వరకున్న సయ్యద్‌సాహెబ్ గత ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ పొందారు. అదనపు బాధ్యతలను చిత్తూరు డీఎస్‌డీవో బాలాజీకి అప్పగించారు. శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు స్పందించి సీనియర్ కోచ్(టెన్నిస్)ఎన్.శశిధర్‌ను డీఎస్‌డీవోగా నియమించాలని ప్రతిపాదించారు. ఈ మేరకు శాప్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో శుక్రవారం సాయంత్రం శ్రీనివాస క్రీడా సముదాయంలో బాధ్యతలు స్వీకరించారు. క్రీడల అభివృద్ధికి, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అసంపూర్తిగా ఉన్న క్రీడా వేదికలపై దృష్టి పెడతామన్నారు.



● నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

ఓను..తీరు ఆపద్బాంధవులు

అర్జెంట్‌గా ఓ పాజిటివ్ రక్తం కావాలి.. ఆస్పత్రిలో ఓరోగి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. దాతలు ఈ నంబరుకు సంప్రదించండి.. ఇలాంటి అభ్యర్థనలు ఇటీవల వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో చూస్తున్నాం. వైద్యశాస్త్రం ఇంత అభివృద్ధి చెందాక కూడా రక్తం దొరకదా.. బ్లడ్ బ్యాంకులు ఉంటాయి కదా అని ఎక్కువ మంది భావిస్తుంటారు. ఔను ..బ్లడ్ బ్యాంకులున్నాయి. కానీ ఇందులో నిల్వ ఉండాలంటే దాతలు ముందుకు వస్తేనే సాధ్యమతుందని గ్రహించాలి. రక్తం ఇవ్వడమంటే సాటి మనిషికి ప్రాణం పోయడమని గుర్తించాలి. ఇలా స్పందించేవారిని దైవ స్వరూపులుగానే భావించాలి. ఇదిగో వీరిని చూడండి..అవతలి వ్యక్తితో ఏబంధమూ లేకున్నా మానవత్వంతో కదిలి తరచూ రక్తదానం చేస్తున్నారు. పదుగురికీ స్ఫూర్తిదాతలుగా నిలుస్తున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

ఏటా ఐదుసార్లు ఇవ్వవచ్చు



రక్తదానం ద్వారా ముగ్గురిని కాపాడవచ్చు. ఆరోగ్యంగా ఉన్న వారు ఏడాదిలో ఐదు సార్లు వరకు రక్తదానం చేయవచ్చు. దాని వలన మరింత ఉత్తేజకంగా, ఆరోగ్యంగా ఉంటారు. శరీరంలో నుంచి రక్తం సేకరించేందుకు ఎక్కువ సమయం పట్టదు. నొప్పి కూడా ఉండదు. 18 ఏళ్ల దాటిన ఆరోగ్యవంతులు నిస్సందేహంగా రక్తదానికి ముందుకు రావాలి

- డాక్టర్ హరిత, బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి, రుయాస్పత్రి



ఇప్పటికి 60సార్లు రక్తదానం చేశా..

రోడ్డు ప్రమాదానికి గురైన ప్రాణ మిత్రుడి బంధువొకరు సకాలంలో రక్తం అందక నా కళ్ల ముందే చనిపోయారు. అది చూసి నా మనసు చలించిపోయింది. అప్పటి నుంచి ఏడాదికి రెండు, మూడు సార్లు కాదు ..అవసరమైతే ఎక్కువసార్లు రక్తదానం చేసున్నాను. పుట్టిన రోజుతోపాటు ఇంట్లో ప్రత్యేక దినాల్లోనూ తప్పక రక్తదానం చేస్తాను. ఇప్పటికే 60 సార్లు రక్తదానం చేశాను. నా భార్యకు కూడా కూడా పదిసార్లు రక్తదానం చేసింది.

- అబ్దుల్ కలాం ఆజాద్, తిరుపతి



ప్రాణాలను నిలబెట్టాలనే తపన

ఆపదలో ఉన్న వారికి సకాలంలో రక్తం అందకపోతే ఎదురయ్యే కష్టాన్ని స్వానుభవంతో తెలుసుకున్నాను. ఇలాంటి పరిస్థితులు ఎవరికీ రాకూడదని భావించాను. అందుకే నావంతు సాయంగా స్పందిస్తున్నాను. ఇప్పటికే 32 సార్లు రక్తదానం చేశాను. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక రోజంటూ లేదూ. సమయం దొరికినప్పుడల్లా వెళ్లి రక్తదానం చేస్తున్నాను. ఇతరుల ప్రాణాలు నిలబెట్టేందుకు ఇది దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నాను.

- పి.మకరంద్, తిరుపతి

వీలైనప్పుడల్లా రక్తదానం చేస్తాను



రోడ్డు ప్రమాదానికి గురైన వారిని ఆస్పత్రికి సకాలంలో తీసుకువెళ్లినా అవసరమైన రక్తం దొరక్క చనిపోయిన వారిని చాలా మందిని చూశాను. ఆ సమయంలో చేసే చిన్నపాటి రక్తదానం వారి ప్రాణాలను నిలబెడుతుందని తెలుసుకున్నాను. వీలైనప్పుడల్లా రక్తదానం చేస్తుంటాను. మొబైల్ రక్తదాన శిబిరాలు కనిపించినా వెళ్తుంటాను. ఇప్పటి వరకు 30 సార్లు రక్తదానం చేశాను.

-డి.మునిశేఖర్ చౌదరి, ఆర్టీసీ ఉద్యోగి, తిరుమల

కొత్త కణాలు ఉత్పత్తవుతాయి



రక్తదానంతో దుష్పలితాలు ఉండవు. దాతల ఎముకల్లో మూలుగ ఉత్తేజితమై కొత్త రక్త కణాలు ఉత్పత్తవుతాయి. ఫలితంగా మరింత ఆరోగ్యవంతులుగా జీవిస్తారు. 18-60 ఏళ్ల లోపు ఆరోగ్యవంతులు రక్తదానం చేయొచ్చు. హెచ్ఐవీ, మలేరియా, కామెర్లు, మధుమేహం, గుండెపోటు, వైరల్ హెపటైటిస్, కాలేయం, మూత్రపిండాల సమస్యలు, గర్భంతో ఉన్నవారు, జన్యు సమస్యలు, మూర్ఛ, మానసిక అనారోగ్యం, గత 3 నెలల్లో శస్త్ర చికిత్సలు, జ్వరం, బరువు తగ్గటం, రెండు వారాల క్రితం కుక్క కాటు బాధితులు లింటి వారు రక్తదానానికి అనర్హులు. ప్రసవం సమయంలో రక్తహీనతతో బాధపడే గర్భిణులకు రక్తం ఎంతో అవసరం. ఇలాంటి సందర్భంలో దాత రెండు ప్రాణాలను కాపాడిన వారవుతారు.


- డాక్టర్ ప్రసన్న రాగూర్, బ్లడ్‌బ్యాంక్ ఇన్‌ఛార్జి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి



అవసరమని తెలిస్తే స్పందిస్తాను

సకాలంలో రక్తం అందకపోతే విలువైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. రక్తం అవపరమని మెసేజ్‌లు వాట్సాప్, ఫేస్‌బుక్ ఇలా ఏ సామాజిక మాధ్యమంలో చూసినా వెంటనే స్పందిస్తాను. వారికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటాను. నిజంగా రక్తం అవసరమైతే ఎంత దూరమైనా వెళ్లి రక్తం ఇచ్చి వస్తున్నాను, నాతో పాటు మా అబ్బాయి పుట్టిన రోజున కూడా రక్తదానం చేయడం అలవాటు చేసుకున్నాను. ఇప్పటికే 30 సార్లు రక్తదానం చేశాను.

- ఎం.నందికేశవన్, తిరుమల



'ఫేక్' నాటక పాత్రధారి ఆపరేటరే

● అతడు దొరికితేనే నకిలీ ఉత్తర్వుల చిక్కుముడి వీడేది

తిరుపతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): 'ఫేక్' నాటక పాత్రధారి గంగమ్మ ఆలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ పి.సి.నవీన్‌కృష్ణా కుమార్. దీని వెనుక సూత్రధారులు ఎవరనేది తేలాలంటే పరారీలో ఉన్న ఆపరేటర్ దొరకాల్సిందే. తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో భజంత్రీలుగా పనిచేస్తున్న జి.శివకుమార్ (నాదస్వరం), పి.వెంకటసుబ్బయ్య, ఆర్.జయరాం (డోలు), పి.అయ్యప్ప (శృతి), పి.రెడ్డెమ్మ (నాదస్వరం)ను గ్రేడ్1గా పదోన్నతి పొందినట్టు ఫేక్ ఉత్తర్వులతో పదోన్నతి కల్పించిన వ్యవహారంపై ఐదుగురిని సస్పెండ్ చేసి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసిన క్రమంలో 'గంగమ్మకే శఠగోపం' శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కలకలం రేపింది. పరారైన నవీన్‌ను పట్టుకొచ్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. అతడ్ని విచారిస్తేనే అసలు విషయాలు వెలుగులోకి వస్తాయని దేవదాయశాఖ అధికారులు అంటున్నారు. కాగా, వైసీపీ హయాంలో జరిగిన నకిలీ ఉత్తర్వుల కథ ఒక్క తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికే పరిమితమైందా? లేదా మిగిలిన దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల్లోనూ చోటుచేసుకుందా? అన్న అనుమానంతో 'ఆంధ్రజ్యోతి' ఆరాతీసింది. ఆర్జేసీ మల్టీజోన్-2 పరిధిలో 16 జిల్లాలు వస్తాయి. గంగమ్మ ఆలయ ఘటన వెలుగులోకి వచ్చాక ఈ ఆలయాల్లో పదోన్నతి ఉత్తర్వులను ఆర్జేసీ పరిశీలించారు. ఎక్కడా ఫేక్ ఉత్తర్వులు తమ దృష్టికి రాలేదని దేవదాయశాఖ సహాయ కమిషనర్ రామక్రిష్ణారెడ్డి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు. గంగమ్మ ఆలయంలో మాత్రమే బయటపడ్డాయని, పరారీలో ఉన్న ఆపరేటర్‌ను విచారిస్తే అసలు విషయం తెలుస్తుందన్నారు. ఇక, వైసీపీ హయాంలో వెలుగు చూస్తున్న నిధుల దుర్వినియోగం, ఫేక్ ఉత్తర్వులు తదితరాలపై సమగ్ర విచారణ జరపాలని ఆలయ మాజీ ఛైర్మన్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ డిమాండు చేశారు.

రాష్ట్రాభివృద్ధికి అండగా కేంద్రం

● పెండింగ్ ప్రాజెక్టులు, నిధుల విడుదలపై త్వరితగతిన పరిష్కారం

● ప్రభుత్వ హామీల రాజ్యసభ అధ్యయన కమిటీ ఛైర్మన్ తంబిదురై



సమావేశంలో మాట్లాడుతున్న బృందం ఛైర్మన్ తంబి దురై

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని, పలు పెండింగ్ ప్రాజెక్టులు, నిధుల విడుదల అంశాలపై రాజ్యసభ ఛైర్మన్‌కు నివేదించి త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తామని ప్రభుత్వ హామీల రాజ్యసభ అధ్యయన కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎం.తంబిదురై అన్నారు. తిరుచానూరులోని తాజ్‌హోటల్‌లో కేంద్ర ప్రభుత్వ హామీలు, వివిధ శాఖలకు సంబంధించి పలు అంశాలపై జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్షించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి నిధుల కొరత ఉందన్నారు. ఏపీకి నిధులు విడుదల, ప్రాజెక్టుల పురోగతికి, జాతీయ రహదారులు తదితర వాటి అభివృద్ధికి అండగా ఉండేందుకు కేంద్రం సుముఖంగా ఉందని, అందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతకుముందు అహ్మదాబాద్ విమాన ప్రమాద దుర్ఘటనపై తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కమిటీ సభ్యులు బీరేంద్రప్రసాద్ బైశ్య, నీరజ్ డాంగి, బాబుబాబ్ జేసంగ్‌బాయిదేశాయి, గిరిరాజన్, మహ్మమద్ నదిముల్ హక్, డాక్టర్ మేధా విశ్రామ్, కులకర్ణి, ఆదిత్యప్రసాద్, దర్శన్‌సింగ్, లహర్‌సింగ్, సిరోయా, జిగ్నేస్ సోలంకి, జేసీ శుభం బన్సల్, జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, బ్యాంకు అధిఅకరులు సత్యనారాయణరాజు, అలోక్ అగర్వాల్, పాండురంగ మితాంతయ, అశోక్ చంద్ర, సునీల్‌కుమార్ చుగ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్య, చంద్రప్రభలపై తేజోమయుడు





సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై ఊరేగుతున్న వెంకటేశ్వరుడు

వడమాలపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై ఉత్సవర్లు మాడవీధుల్లో విహరించారు. ఇక, ఉదయం వాహనం తర్వాత వేంకటేశ్వరస్వామి, పద్మావతి, ఆండాళ్ ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం.. సాయంత్రం ఊంజల సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, కంకణభట్టార్ తిప్పయ్యఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీవారి రథోత్సవం: శనివారం ఉదయం 9.00-10.30 గంటల మధ్య ఉభయ దేవేరులతో ప్రసన్న వేంకటేశ్వరుడి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు.

అద్దె చెల్లించలేదని సచివాలయానికి తాళం

సత్యవేడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా అద్దె చెల్లించడం లేదంటూ సత్యవేడు మండలం కన్నావరంలోని సచివాలయానికి భవన యజమాని శుక్రవారం అదనపు తాళం వేశారు. ఉదయం విధులకు వచ్చిన సిబ్బంది అదనపు తాళాన్ని చూసి భవన యజమానిని సంప్రదించారు. సచివాలయానికి 24 నెలల అద్దె చెల్లిస్తేనే తాళం తీస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయం తెలిసి ఎంపీడీవో తరుణాక్షరెడ్డి, ఏవో త్రివిక్రమరావు గ్రామానికి చేరుకుని భవన యజమాని మణి, సర్పంచ్ బాలకృష్ణతో చర్చించారు. అద్దె బకాయిలను పంచాయతీ నిధుల నుంచి చెల్లించేలా ఏర్పాటు చేశారు. దీంతో భవన యజమాని మణి అందుకు అంగీకరించి కార్యాలయం తెరవడంతో వివాదం సద్దుమణిగింది.



సచివాలయం వెలుపల వేచి ఉన్న సిబ్బంది

తనియాలిలో అనంతపురంవాసి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

దొరవారిసత్రం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం తనియాలిలో అనంతపురం జిల్లాకు చెందిన అంజప్పగారి ఈశ్వరప్ప(45) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కథనం మేరకు.... అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం గుండిగానిపల్లెకు చెందిన అంజప్పగారి ఈశ్వరప్ప డీఎస్సీ పరీక్షలు రాయడానికి వెళుతున్నట్లు చెప్పి రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి వచ్చాడు. గురువారం తనియాలి వద్ద పొలాల్లో గొర్రెల కాపరులతో మాట్లాడాడు. తాను అలిగి ఇంటి నుంచి వచ్చేసినట్లు చెప్పాడు. గొర్రెల కాపరుల వద్ద భోజనం చేసిన ఈశ్వరప్ప శుక్రవారం రాత్రి కాళంగి నది ఒడ్డున ఉన్న చెత్త నుంచి సంపద తయారీ షెడ్డులో ఉరేసుకుని మృతి చెందాడు. ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ అజయ్‌కుమార్ పోలీసు సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వా స్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడుకి భార్య శ్రీలత, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

తండ్రిపై తనయుడు కత్తితో దాడికి యత్నం

ఇద్దరికి గాయాలు

బాలాయపల్లి, జూన్ 13: తండ్రిపై తనయుడు కత్తితో దాడికి యత్నించిన ఘటనలో ఇద్దరికి గాయాలపాలైన సంఘటన మండలంలోని చిలమ నూరు గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... చిలమనూరు గ్రామానికి చెందిన మోడె హరికృష్ణపై ఆయన కుమారుడు గిరి కత్తితో దాడికి యత్నించాడు. భయభ్రాంతులకు గురైన హరికృష్ణ పక్కనే ఉన్న సుబ్బయ్య ఇంటిలోకి ప్రవేశించి తలదాచుకున్నాడు. తన తండ్రిని దాచిపెట్టారనే కోపంతో సుబ్బయ్య, పోలమ్మపై గిరి దాడి చేశారు. ఈ ఘటనలో సుబ్బయ్యకు స్వల్ప గాయాలు కాగా, పోలమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. వారికి వెంకటగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పోలమ్మను తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీలపై విస్తృత ప్రచారం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో మునికుమారి

కోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న కార్పొరేట్‌స్థాయి విద్యపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని సీడీపీవో మునికుమారి కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ వర్కర్లతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ మూడేళ్లు నిండిన ప్రతిబిడ్డ విధిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేలా తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రీ స్కూల్‌లో సమయపాలన పాటించాలని, నిబంధనలు పాటించిక పోతే సంబంధిత ఇబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం మంజూరు చేసి పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ కవిత, కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధవరంలో ఉచిత వైద్య శిబిరం

కోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సిద్ధవరంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. చిల్లకూరు మండలం వల్లిపేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ దినేష్, డాక్టర్ శివశంకర్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జ్వరాలు, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు. తాగునీటిని ఎలా శుద్ధి చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు భువనేశ్వరి, ఏఎన్ఎం నాగమణి, సౌజన్య, తిరుపాలమ్మ, రావమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నాయుడుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ అన్నారు. నాయుడుపేట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం అంగన్‌వాడీ ప్రాజెక్టు మహాసభలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, మే నెల మొత్తం సెలవుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మండల కమిటీ అధ్యక్షురాలుగా రూపాదేవి, ప్రధాన కార్యదర్శి నెలవల శ్యామలమ్మ, కోశాధికారి మేరీ ప్రమీల, గౌరవ అధ్యక్షుడు శివకవి ముకుందను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంధ్యారాణి, కళావతి, విజయనిర్మల, జానకమ్మ, ప్రమీల, ఉషా, శాంతి, సింధుజా తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

దక్కిలి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్‌ఐ శివశంకర్ అన్నారు. శుక్రవారం ఆయన జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సరైన పత్రాలు లేకుండా డ్రైవింగ్ చేసినా, మైనర్లకు ద్విచక్రవాహనాలు చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు

నాయుడుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో బోధన జరుగుతోందని నాయుడుపేట ఎస్‌సీజీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ గురవయ్య, రమణరావు అన్నారు. నాయుడుపేటతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో పదో తరగతి పాస్ అయిన విద్యార్థుల గృహాలకు వెళ్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల చేరాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలో లక్షల రూపాయలు ఫీజులు ఉంటాయని, ప్రభుత్వ కళాశాలలో విద్య, పుస్తకాలు, భోజనం పూర్తిగా ఉచితమన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ కళాశాలలో క్వాలిఫైడ్ అధ్యాపకుల ద్వారా నాణ్యమైన బోధన అందిస్తామన్నారు.

రోడ్లపై ఆక్రమణలను తొలగించండి

నాయుడుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజారువీధుల్లో రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను, తోపుడు బండ్ల తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ప్లానింగ్ కార్యదర్శులతో మాట్లాడుతూ పట్టణంలో రోడ్లపై బండ్లు, దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు.

వసతి గృహం, పాఠశాలల పరిశీలన

వాకాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అంబేడ్కర్ గురుకులం, ఎస్‌ఏఎల్‌సీఈఎఫ్ పాఠశాల, బీసీ హాస్టల్‌ను తహసీల్దారు రామయ్య శుక్రవారం పరిశీలించారు. పాఠశాలల్లో పరిసరాలు శుభ్రంగా ఉంచేలా చూడాలని ప్రిన్సిపాల్‌ను సూచించారు. బీసీ హాస్టల్‌ను పరిశీలించి విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

కోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వంజివాకలో శుక్రవారం ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీవో దిలీప్‌కుమార్‌నాయక్ ప్రారంభించారు. అల్లంపాడు, కొక్కుపాడు, తిమ్మానాయుడుపాళెం పంచాయతీల ప్రజలు ఈ ఆధార్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

రైల్లో నుంచి పడి యువకుడి మృతి

తడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రైల్లో నుంచి జారిపడి యువకుడు మృతి చెందాడు. జీఆర్‌పీ ఎస్‌ఐ చెన్నకేశవ తెలిపిన వివరాల మేరకు.. తడ, అక్కంపేట ఎగువ రైలు మార్గంలో 76వ కిలో మీటరు వద్ద శుక్రవారం ఉదయం యువకుడు మృతదేహం ఉన్నట్లు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఈ నెల 9న పాట్నా నుంచి కొయ్యంబత్తూరుకు వెళ్లేందుకు టిక్కెట్ లభించింది. నలుపురంగు జీన్స్ ప్యాంట్, ఎరుపురంగు టీషర్టు ధరించి ఉన్నాడు. రాత్రి సమయంలో ప్రమాదవశాత్తు రైల్లో నుంచి జారి పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్‌పీ ఎస్‌ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మురళీ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నీటిగుంటలో పడి వృద్ధుడి మృతి

చిల్లకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లవోలు సమీపంలోని నీటిగుంటలో పడి వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... గ్రామానికి చెందిన రామకృష్ణయ్య(65) గురువారం సాయంత్రం గ్రామానికి సమీపంలోని నీటిగుంటలో చేపలు పట్టుకునేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు గుంటలో పడి మృతిచెందాడు. రామకృష్ణయ్య ఇంటికి రాకపోవడంతో శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు గాలించగా నీటిగుంటలో మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18న మండల సమావేశం

వెంకటగిరి టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తంబిరెడ్డి తనూజారెడ్డి అధ్యక్షతన ఈనెల 18న నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి తెలిపారు.

ఆటోవాలాల అడ్డా ఆర్టీసీ బస్టాండు

తీవ్ర ఇబ్బందులు పడుతున్న బస్సు డ్రైవర్లు, ప్రయాణికులు ● పట్టించుకోని అధికారులు


ఆర్టీసీ బస్టాండులో అడ్డంగా నిలిపి ఉన్న ఆటోలు

సూళ్లూరుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటోవాలాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. బస్సులు బయటకు వచ్చేటప్పుడు.. లోపలకు వెళ్లేటప్పుడు కొందరు ఆటోవాలాలు ప్రవర్తించే తీరు అటు ప్రయాణికులకు, ఇటు బస్సు డ్రైవర్లకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తోంది. ఆర్టీసీ బస్టాండుతో పాటు ఎదురుగా ఉన్న జీఎన్‌టీ రోడ్డు, మార్కెట్ సెంటర్, షార్ సర్కిల్ ప్రాంతాల్లో ఆటోవాలాలు ఎక్కడపడితే అక్కడ నిలుపుతున్నారు. బస్టాండ్ నుంచి బస్సు బయలుదేరే సమయంలో ప్రయాణికులు త్వరగా బస్సు ఎక్కే ప్రయత్నం చేస్తుంటారు. ఈ క్రమంలో ఆటోవాలాలు అడ్డుగా ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. బస్టాండ్‌లో ఉన్న ఆర్టీసీ సిబ్బంది కూడా పట్టించుకోవడం లేదు. ఆటోలు అడ్డదిడ్డంగా ఎక్కడపడితే అక్కడ నిలపడంతో ఇటు ఉత్తరం వైపు, ఇటు దక్షిణవైపు నుంచి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఆటోవావాలను నియంత్రించేందుకు ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో ఒక హోంగార్డు డ్యూటీలో నిరంతరం ఉండేవారు. ప్రస్తుతం ఆ వ్యవస్థ లేకపోవడంతో ఆటోవావాలకు ఇష్టారాజ్యమైంది. మార్కెట్ సెంటర్ వద్ద అయితే రోడ్డుకు అడ్డంగా ఆటోలు నిలపడంతో బజారు వీధుల్లోకి పనుల నిమిత్తం వెళ్లేవారికి అవస్థలు తప్పడం లేదు. బస్టాండు ఆవరణలో అడ్డదిడ్డంగా ఆటోలు ఉంటున్నా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు ఆటోవాలాలకు నియంత్రించాల్సిన అవసరం ఉంది.

చెరువులా పాఠశాల మైదానం


బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిలచిన వర్షపునీరు

సూళ్లూరుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానం చిన్నపాటి వర్షమొచ్చినా చెరువును తలపిస్తోంది. మైదానంలో పడిన వర్షపునీరు బయటకు వెళ్లేందుకు వీలులేకపోవడంతో నిల్వచేరుతోంది. పాఠశాలలు పునఃప్రారంభం రోజు గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో పాఠశాల మైదానమంతా నీటితో నిండిపోయింది. దీంతో విద్యార్థులతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసేవారు ఇబ్బందులు పడుతున్నారు. మైదానంలో నీరంతా పాఠశాలను ఆనుకొని ఉన్న మురుగు కాలువలోకి వెళ్లే విధంగా ఎత్తు పెంచాల్సిఉంది. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాల మైదానంలో వర్షపునీరు నిల్వ చేరకుండా చూడాల్సిన అవసరం ఉంది.

అధ్వానంగా డ్రైనేజీ కాలువలు


చిల్లకూరు వడ్డిపాళెం వద్ద అధ్వానంగా ఉన్న డ్రైనేజీకాలువ

చిల్లకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిల్లకూరు వడ్డిపాళెం ప్రాంతంలో డ్రైనేజీ కాలువలు అధ్వానంగా ఉన్నాయి. వడ్డిపాళెం సమీపంలోని ప్రధాన రహదారికి అనుకుని ఉన్న డ్రైనేజీ కాలువ పూర్తిగా ధ్వంసమైంది. మురుగునీరు ముందుకు కదలకపోవడంతో ఇబ్బందిగా ఉందని స్థానికులు, చెబుతున్నారు. అంతేకాకుండా డ్రైనేజీ కాలువ అధ్వానంగా ఉండడంతో ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే సమయంలో అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారమని వాహనదారులు అంటున్నారు. అదేవిధంగా వడ్డిపాళెంలోని ఓ ఏటీఎం ఎదురుగా ఉన్న వీధిలో ఉన్న డ్రైనేజీ కాలువ అధ్వానంగా ఉంది. కాలువలోని మురుగు ముందుకు కదలకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, చిన్నపాటి వర్షం కురిసినా కాలువలోని మురుగు రోడ్డుపై చేరడంతో రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు డ్రైనేజీ కాలువలను బాగు చేయాలని కోరుతున్నారు.

కొళాయిల్లో కలుషిత నీరు

సూళ్లూరుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలో పలు ప్రాంతాల్లోని కొళాయిల్లో కలుషిత తాగునీరు వస్తోంది. పిండిపాలెం వద్దనున్న కోటపోలూరు చెరువులోని సమ్మర్ స్టోరేజ్, తల్లంపాడు చెరువులో ఉన్న బోరు పాయింట్ల ద్వారా పట్టణానికి తాగునీరు అందిస్తున్నారు. మూడు రోజుల నుంచి పట్టణంలోని పొట్టి శ్రీరాముల వీధి, పార్కువీధి, పీర్లచావడం, గాండ్లవీధి ప్రాంతాల్లోని కొళాయిల్లో దుర్వాసనతో కూడిన కలుషిత నీరు వస్తోంది. చాలాచోట్ల పైపులైన్ పగిలి తాగునీటితో మురుగు కలడం వల్లే కలుషితంగా మారిందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై డీఈ శ్రీనివాసరావుని వివరణ కోరగా కలుషిత తాగునీరు వస్తున్నట్లు తమ దృష్టికి రాలేదని, పైపులైన్లను తనిఖీ చేయించి ఎక్కడైన లీకేజీలు ఉంటే సరి చేస్తామన్నారు.

సూర్యప్రభ వాహనంపై వెంకన్న



గూడూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజావీధిలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని సూర్యప్రభ వాహనంపై, రాత్రి చంద్రప్రభ వాహనంపై అలంకరించి గ్రామోత్సవం జరిపారు. అలాగే లక్ష్మీసంవాదం, ముసుగులసేవ నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు, ఈవో రవికృష్ణ పాల్గొన్నారు.

ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు

గూడూరు అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పవరప్పాడు గ్రామంలో శుక్రవారం తిరుపతి వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(సిమ్స్) ఆధ్వర్యంలో పింక్‌బస్సు ద్వారా ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని నివారించేందుకు రాష్ట్రప్రభుత్వం సిమ్స్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సల్మా, లీలాకృష్ణ, పద్మావతి, చైతన్యభాను తదితరులు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ పిలుస్తోంది'

తడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమం జరిగింది. పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జ్యోతి కిరణ్, సూపర్ వైజర్లు లక్ష్మి, నారాయణమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

సూళ్లూరుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట స్టేట్ బ్యాంక్‌లో శుక్రవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఎస్‌బీఐ స్థాపించి 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేసినట్లు మేనేజర్ కసిరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక గోకులకృష్ణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, స్థానికులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అంబటి పృథ్వీరాజ్, ఏవో సాయిబాబ, సిబ్బంది పాల్గొన్నారు.

సాయి ఆలయంలో సామూహిక పూజలు

వాకాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వాకాడు సాయిబాబా ఆలయంలో శుక్రవారం షిరిడీసాయి అనుబంధ సేవాసంస్థ ఆధ్వర్యంలో సామూహిక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు గంగిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఆలయ ధర్మకర్తలు విజయలక్ష్మి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దారి విషయమై రికార్డుల పరిశీలన


రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

పెళ్లకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు గ్రామంలో దారి విషయమై వివాదనం నెలకొనడంతో శుక్రవారం సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. గ్రామ సమీపంలో నెలకొల్పిన స్టీల్ పరిశ్రమకు సంబంధించిన వాహనం గ్రామంలోని ప్రధాన రహదారిలో వెళ్తూ ప్రమాదవశాత్తు ఓ బాలుడిని ఢీకొంది. బాలుడు మృతిచెందడంతో పరిశ్రమ వాహనాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం గ్రామానికి వెలుపల ప్రైవేట్ భూముల్లో తాత్కలికంగా రోడ్డు ఏర్పాటు చేసుకుంది. ఆ భూములకు పదేళ్లుగా నష్టపరిహారం చెల్లించలేదని బాధితులు రోడ్డుకు అడ్డంగా గోడను నిర్మించి రాకపోకలు నిలివేశారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో కిరణ్మయి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డి, వీఆర్వో మోబీనా పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు ఇవ్వండి

కోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తమకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సూరిశెట్టిపాళెం గిరిజనులు శుక్రవారం తహసీల్దారు జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. కొక్కుపాడు పంచాయతీ పరిధిలోని సూరిశెట్టిపాళెం గిరిజన కాలనీలో ఒక్కొక్క ఇంట్లో రెండేసి కుటుంబాలు ఉంటున్నాయన్నారు. ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని గిరిజనులు కోరారు.

సెక్టార్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

కోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు సెక్టార్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. సీఐటీయూ నేత బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కోట ప్రాజెక్టు కమిటీని ఎన్నుకున్నారు. అంగన్‌వాడీ అసోసియేషన్ కోట ప్రాజెక్టు అధ్యక్షురాలుగా విజయలక్ష్మి, కార్యదర్శిగా పద్మలీల, కోశాదికారిగా కోటేశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదే విధంగా జిల్లా విభాగానికి కార్యదర్శిగా వాణిశ్రీ, కోశాధికారిగా రాజేశ్వరి, అధ్యక్షురాలిగా పద్మలీలతో పాటు 9మంది సెక్టార్ లీడర్లను ఎన్నుకున్నారు.

కోటమ్మకు మల్లెల అలంకారం

కోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు శుక్రవారం మల్లెల అలంకారం చేశారు. ఆలయ పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి పలు అభిషేకాలు చేసి మల్లెపూలు, కనకాంబరాలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత

చిల్లకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పారిచెర్లవారిపాళెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అనసూయ అన్నారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు పారిచెర్లవారిపాళెం గ్రామానికి చెందిన బల్లి రామచంద్రారెడ్డి సహకారంతో నగదు ప్రోత్సాహకాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులు నవ్యశ్రీకి రూ.5వేలు, తన్వికి రూ.3వేలు, లోహిత్‌కు రూ.2వేలు నగదు బహుమతులు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో షకీలా, చంద్రశేఖర్, మాధవయ్య, ప్రజేంద్రరెడ్డి, విద్యుల్లత, మధుసూదన్‌రావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


నగదు బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

14, 16, 19 తేదీల్లో పలు రైళ్ల రద్దు

తడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మధ్య ఈనెల 14(శనివారం), 16(సోమవారం), 19(గురువారం) తేదీల్లో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే చెన్నై డివిజన్ అధికారులు తెలిపారు. చెన్నై - గూడూరు మార్గంలో కవర్‌పేట, గుమ్మిడిపూడి స్టేషన్ల మధ్యలో కొద్ది నెలలుగా ఇంజనీరింగ్ సిగ్నల్ వ్యవస్థల మార్పులు వంటి పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో 14, 16, 19 తేదీల్లో ఉదయం 11.20 నుంచి మధ్యాహ్నం 3.20 వరకు పనులు చేపడతారు. ఆ సమయంలో పలు రైళ్లను రద్దు చేశారు.

రద్దు చేసిన రైళ్ల వివరాలు...


- సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు మధ్యాహ్నం 3.50కు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66037
- నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు సాయంత్రం 6.40 నిమిషాలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు నెంబరు 66038
- చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10, 1.05 గంటలకు, రాత్రి 9.00 గంటలకు బయలుదేరే ఈఎంయే లోకల్ రైళ్లు.
- సూళ్లూరుపేట నుంచి చెన్నై మోర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు మధ్యాహ్నం 1.10 నిమిషాలకు, 3.10, రాత్రి 9.00 గంటలకు బయలుదేరి వెళ్లే ఈఎంయూ లోకల్ రైళ్లు.
- చెన్నై నుంచి గుమ్మిడిపూడికి ఉదయం 9.40, 10.30, 11.35, మధ్యాహ్నం 12.40లకు వెళ్లే ఈఎంయూ రైళ్లు.
- గుమ్మిడిపూడి నుంచి చెన్నైకు ఉదయం 10.55, మధ్యాహ్నం 1.00 గంటకు, 2.30, 3.15లకు బయలుదేరి వెళ్లే ఈఎంయు లోకల్ రైళ్లను రద్దు చేశారు. మరి కొన్ని రైళ్లు పాక్షికంగా రద్దయ్యాయి.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం


చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న జలీల్‌అహ్మద్ తదితరులు

కోట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేరుస్తూ సీఎం చంద్రబాబునాయుడు ప్రజల మన్ననలు పొందుతున్నారని టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ అన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా తల్లికి వందనం నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. శుక్రవారం కోటలోని టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి జలీల్ అహ్మద్‌తో పాటు తెలుగు మహిళలు, నాయకులు, పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మధుయాదవ్, ఎంపీటీసీలు దారా సురేష్‌బాబు, షంషుద్దీన్, శ్రీధర్‌రెడ్డి, కోటేశ్వరరావు, నౌషాద్, శ్రీనివాసులు, పోలమ్మ, నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు, పక్కన డీఈఈ శేఖర్, ఏఈలు పూర్ణిమ, మోహిని, మురళి తదితరులు

సూళ్లూరుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని నాయుడుపేట విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యఘర్ పథకం కింద బ్యాంకులు తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నాయన్నారు. విద్యుత్తు బిల్లుల భారం తగ్గుతుందని, దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీఈఈ శేఖర్, ఏఈలు పూర్ణిమ, మోహిని, మురళి, జగదీష్, విద్యుత్తుశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చెంగాళమ్మ ఆలయ ప్రహరీ ప్రారంభం

ఓజిలి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండలో వెలసిన చెంగాళమ్మ ఆలయ పునరుద్ధరణ పనుల్లో భాగంగా నిర్మించిన ప్రహరీని శుక్రవారం సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. చెంగాళమ్మ ఆలయం జీర్ణావస్థలో ఉండగా గ్రామానికి చెందిన కృష్ణయ్య పునరుద్ధరించారు. ఇందులో భాగంగా ఆలయానికి ప్రహరీ నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దారా అంకయ్య, శ్రీనివాసులరెడ్డి, ముత్యాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట ఏడీఏగా నాగార్జునసాగర్

నాయుడుపేట టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట వ్యవసాయశాఖ ఏడీఏగా నాగార్జునసాగర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వెంకటగిరిలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం వ్యవసాయశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.